ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 150 పేజీలు: 10+4 వెల: 6.50

రేపటి నుంచి పెట్రోలు, డీజిల్‌పై ఆంక్షలు ఎత్తివేత 2

నేడు దోహాలో అమెరికా-ఇరాన్ చర్చలు

## ఉద్యోగులకు రెండో విడత చెల్లింపులు పూర్తి

## బకాయిలు 2 వేల కోట్లు రిలీజ్



**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రఖజానా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బకాయిల చెల్లింపు ప్రక్రియను రాష్ట్ర సర్కార్ వేగవంతం చేసింది. గత నెల 29న మొదటి విడతలో రూ. 2 వేల కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా మరో రూ.2 వేల కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు విడుదల >>2

# 'జీరాంజీ' చట్టాన్ని విరమించండి

## రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారాన్ని వ్యతిరేకిస్తున్నాం

**పేదలకు, వ్యవసాయ కూలీలకు నష్టమే**

**సబ్‌కమిటీలో చర్చించాం, నిర్ణయం తీసుకొంటాం**

### ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశంలో తేల్చి చెప్పిన మంత్రి సీతక్క

**కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం**



సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్29:** న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ రామ్‌జీ చట్టం అమలుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను మంత్రి సీతక్క వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర ప్రభుత్వ తరఫున వినతిపత్రాన్ని అందజేశారు.సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, కొత్త చట్టంలో రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపే నిబంధనలు ఉన్నాయని, వాటిపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన >>2

# ట్రిలియన్ తెలంగాణ

## 2034 నాటికి ఆర్థిక వ్యవస్థ మున్ముందుకు

**పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, భారత స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరిగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఒక జాతీయ ఆంగ్ల పత్రిక వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు 5శాతం వాటాను అందిస్తోందని, 2047 నాటికి ఈ వాటాను 10శాతంకు రెట్టింపు చేయాలని భావిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని, వీరికి ఈ ఏడాదే రూ.21,000 కోట్ల రుణాలు అందించామని, ఎన్‌పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని తెలిపారు. పెట్టుబడిదారుల విశ్వాసానికి రెండు ప్రధాన అంశాలు కారణమని శ్రీధర్ బాబు అన్నారు. రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు. టిఎస్ఐపిఏఎస్ఎస్ సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని, ఇప్పుడు "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0" ద్వారా సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్‌టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. 1950-70వ దశకాలలో స్థాపించిన సంస్థల ఆధారంగా అభివృద్ధి చెందిన తెలంగాణ రక్షణ, ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, రాబోయే రీజినల్ రింగ్ రోడ్, వరంగల్, ఆదిలాబాద్‌లలో నిర్మిస్తున్న కొత్త విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా జిల్లా కేంద్రాలకు హైదరాబాద్ స్థాయి కనెక్టివిటీని >>2



సోమవారం మధిరలో సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న డి.సిఎం భట్టి

# మధిర సభ నేడు హైదరాబాద్‌కు

## భారీ వర్షాల కారణంగా వేదిక మార్పు

### శిల్పకళా వేదికలో రైతు భరోసా పంపిణీ సదస్సు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్29:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రభుత్వ కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను చివరి నిమిషంలో రద్దు చేశారు. వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం >>2



# 12 మంది ఐపిఎస్‌ల బదలీ

**ఖాళీగా ఉన్న డిఐజి పోస్టుల్లో పలువురికి అదనపు బాధ్యతలు**

## వరంగల్ కొత్వాల్‌గా శ్వేత

## సైబరాబాద్ ట్రాఫిక్ బాస్‌గా సన్‌ప్రీత్ సింగ్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 12 మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఆదేశాలు జారీచేసి ంది. తాజా బదిలీలలో సుధీర్ఘకాలంగా ఖాళీగా వున్న డిఐజి పోస్టుల్లో సీనియర్ అధికారులకు పూర్తి బాధ్యతలను అప్పగించగా కొన్ని స్థానాల్లో కొత్తవారిని నియమించారు. నగర జాయింట్ పోలీసు కమిషనర్ (ఉత్తర మండల శాంతి భద్రతలు)గా వున్న ఎస్. శ్వేతను వరంగల్ కొత్వాల్‌గా నియమించారు. దీంతో పాటు >>2



# ట్రిలియన్ తెలంగాణ

>> విస్తరించనున్నట్లు తెలిపారు. 30,000 ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో, కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 200 ఎకరాల్లో ఏఐ సిటీ, గ్రీన్ ఫార్మా యూనిట్లు, అన్ని తరగతుల వారికి నివాస ప్రాంతాలు, దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదటి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఉంటాయి. ఎంఎస్‌ఎంఈల విషయంలో, వచ్చే ఐదేళ్ల కోసం రూ.600 కోట్లు కేటాయించినట్లు, ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు.

# సభ నేడు హైదరాబాద్‌కు

>> తీసుకుంది. ఈ సభను రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పంపిణీ సదస్సుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొంటారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షి ంచే అవకాశం కల్పించనున్నారు.

**రైతు ఆశీర్వాద సభ వాయిదా...డిప్యూటీ సీఎం విక్రమార్క**


రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ మేరకు దీనికి సంబంధించి సోమవారం ఒక ప్రకటనలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలోని సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందన్నారు. జగన్నాథ పురంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత ముగింపు వేడుకగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్రాన్ని నం.1గా నిలబెడతాం: డి. సిఎం భట్టి


**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలబెడతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాంతరంగా పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల పాల్చేసిందని విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం నాడు జమలాపురంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గత ప్రభుత్వానికి అప్పగిస్తే ఆ నిధులన్నింటినీ కరిగించి మరో 8 లక్షల కోట్ల రూపాయల అప్పులను మిగిల్చిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిరుపేదల, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద ఉండకూడదనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో ఐదు లక్షల ఇందిరమ్మ ఇండ్లను తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అలాగే రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నట్లు తెలిపారు.కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సర్వీస్ సెక్టార్), పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (పరిశ్రమలు), రూరల్ రీజియన్ ఎకానమీ (వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు)గా విభజించి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెపారు.

# జంటభూకంపాల్లో అర్జంటీనా ఫుట్‌బాలర్ భార్య, పిల్లలు మృతి

**కారకాస్,జూన్ 29:** వెనెజులా లో ఇటీవల సంభవించిన జంట భూకంపాల విపత్తులో అర్జెంటీనా ఫుట్‌బాలర్ లుకాస్ ట్రెజో తన కుటుంబాన్ని కోల్పోయారు. భవనం కూలిపోవడంతో భార్య, ఇద్దరు పిల్లలు శిథిలాల కింద నలిగిపోయారు. వారి మరణాన్ని ఫుట్‌బాల్ క్లబ్ డిపోర్టివో లా గువేరా ధ్రువీకరించింది. ఈ భూకంపం ధాటికి వెనెజులాలోని యారకూ ప్రాంతం అతలాకుతలమైంది. కుటుంబం ఉన్న భవనం కూడా కూలడంతో అతడి భార్య యానినా మారనెల్లా, ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఆ ముగ్గురు శిథిలాల కింద ప్రాణాలు విడిచారు. అప్పుడు ఫుట్‌బాలర్ తన టీమ్‌తో వేరే ప్రాంతంలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. భూకంపం తర్వాత తన భార్య, పిల్లలు గల్లంతయ్యారన్న వార్త వినగానే షాక్‌కు గురైన లుకాస్ అక్కడకు చేరుకొని తన కుటుంబం కోసం శిథిలాలను తొలగిస్తూ వెతకడం ప్రారంభించాడు. ఇదిలావుంటే భూకంపం ధాటికి అతలాకుతలమైన వెనెజులాకు బ్రెజిల్‌స్టార్ ఫుట్‌బాలర్ నెయ్‌మర్ ఆప న్నహస్తం అందించాడు. రూ.2.35 కోట్లు విరాళంగా ప్రకటించాడు.



సోమవారం సీషెల్స్‌లోని విక్టోరియా పీస్‌పార్క్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ




# ప్రాంతీయ అభివృద్ధికి హైస్పీడ్ గ్రోత్ కారిడార్లు!

## కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి కృషితో ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 65లకు మహర్దశ

**హైదరాబాద్,జూన్ 29:** తెలంగాణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రణాళికలోభాగంగా ఎన్‌హెచ్44(హైదరాబాద్ నాగ్‌పూర్ మార్గం), ఎన్‌హెచ్65 (హైదరాబాద్ విజయవాడ రహదారి)లను ఆర్థిక ప్రగతి కారిడార్లుగా అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషిచేస్తున్నాయి. ఈ రెండు ప్రధాన రహదారులు అటు నాగ్‌పూర్ ఇటు విజయవాడకు రహదారుల ఆధునీకరణ, కేంద్ర రవాణాపై పెట్టుబడులకు ఆస్కారమిస్తూ ప్రాంతీయ పారిశ్రామికాభివృద్ధిని ఏవిధంగా సమ్మిళితం చేయగలవో అధ్యయనం చేసేందుకు అవకాశం ఏర్పడింది. రహదార్ల ఆధునీకరణతో ఆ రెండు కారిడార్లను ఉన్నతీకరించడమంటే ప్రయాణ దూరాలు తగ్గించడం, తద్వారా రవాణా వ్యయాన్ని బాగా తగ్గేలాచూసుకోవడం వలన ప్రాంతీయ పారిశ్రామికాభివృద్ధి గణనీయంగాపెరుగుతుంది.

మార్కెట్ అందుబాటు గరిష్టంగా, రవాణా ఖర్చులు కనిష్టంగా ఉన్న చోట పారిశ్రామిక కార్యకలాపాలు సహజంగానే కేంద్రీకృతమవుతాయి. ప్రత్యేక పారిశ్రామిక తయారీ మండలాలు, ఆహారశుద్ధి పార్కులు, లాజిస్టిక్ కేంద్రాలను అనుసంధానిస్తూ ఈ కారిడార్ల అభివృద్ధి జరుగుతోంది. సరళ రవాణా నెట్‌వర్క్‌లను ఆర్థిక కారిడార్లుగా మార్చడం ప్రాదేశిక ప్రణాళికలో కీలకమైన మార్పును గమనిస్తాము. రవాణా కారిడార్లు ప్రధానంగా ముఖ్యపట్టణాలను కలిపే రవాణా మార్గాలుగా పనిచేస్తాయి. రవాణా దూరం తద్వారా రవాణా ఖర్చులేకాదు, సరిహద్దు చెక్‌పోస్టులవద్ద మితిమీరిన ఆలశ్యాలు ఇవన్నీ ఇరుకు నడవాలను ఇబ్బంది పెడుతుంటాయి. ఇలా అన్ని సందర్భాల్లోను కలిసిరాని రవాణానుప్రాదేశిక ఆర్థికవేత్తలు, ప్రాదేశిక ఘర్షణలుగా సిద్ధాంతీకరించారు. ఎప్పుడైతే ఇలాంటి సంఘర్షణలు ఆలస్యాలతో ఏర్పడే ప్రతికూలతలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి ప్రణాళికగా ఈ రహదారి కారిడార్లను అభివృద్ధిచేయడం మధ్య భారత దేశంలోని అతిపెద్ద పారిశ్రామిక ప్రగతికి చేయూతినిస్తుంది. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రానికి అటూ ఇటూ అభివృద్ధి చెందబోయే రవాణా కారిడార్లలోకి పారిశ్రామిక ముడిపదార్థాలనుంచి తుది ఉత్పత్తులు పూర్తయ్యేవరకూ ఎన్నో రవాణా సౌకర్యాలు, సౌలభ్యాలకు వీలు కలిగించే కారిడార్‌లుగా రూపొందుతాయి.

హైదరాబాద్ పారిశ్రామికీకరణకు ఈ రెండు రహదారి కారిడార్లు దోహదంచేస్తాయి. అంతేకాకుండా హైదరాబాద్ నగర భౌగోళిక పరిధి కూడా విస్తరిస్తుంది. ఇలా విస్తరించిన ప్రాంతాల్లో ఎంతోమందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక క్లస్టర్లుకూడా వేగవంతంగా అక్కడకొస్తాయి. హైదరాబాద్ ఉత్తరం వైపు ఎన్‌హెచ్44లో అభివృద్ధి చెందిన ఆహారశుద్ధి పార్కులు, లాజిస్టిక్ కేంద్రాలు, ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్స్, వస్త్ర తయారీ పరిశ్రమలు కూడా అభివృద్ధిచెందాయి. రెండోవైపున తూర్పు కారిడార్ ఎన్‌హెచ్ 65 ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత ఓడరేవులకు వారధిగా ఉంది. ఈ కారిడార్‌లో ఖనిజ ఆధారిత పరిశ్రమలు, భవన నిర్మాణ సామగ్రిసముదాయాలు, మెగా ఫుడ్ పార్కులు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు విరివిగా ఉన్నాయి. ఈ క్లస్టర్‌లోని ఉమ్మడిమౌలిక సదుపాయాలు ఉండటంతో నైపుణ్యమున్న శ్రామిక శక్తికి ఉపాధి లభిస్తుంది. కారిడార్ల ఆధునీకరణలో బహుళ జాతి సంస్థలు దేశీయ సంస్థలు గణనీయంగా మూలధన పెట్టుబడులకు అవకాశం ఉంది. మధ్యభారత దేశంలో ముడిపదార్థాల వనరులను తెలంగాణ తయారీ కేంద్రాలు, కోస్తాతీర ప్రాంతంలోని ఎగుమతి కేంద్రాలతో అనుసంధానించబడే ప్రత్యేక సౌకర్యాలు కూడా అందుబాటులోకి వస్తాయి. తెలంగాణ అభివృద్ధి అంతా ప్రధానంగా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైంది. దీనివల్ల ఇన్వెంటరీ నిర్వహణ ఖర్చులను తగ్గిస్తుంది.

ఈ రవాణా రహదారి కారిడార్ల ఏర్పాటువ్ల ఎక్కడికక్కడే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాలనుంచి కూలిపనులకోసం వలసవెళ్లిన వారు స్థానికంగానే ఉపాధి పొందుతారు. ఈ కారిడార్లలో గ్రామీణ సమాజానికి అందుబాటులో ఉండేప్రత్యామ్నాయ వ్యవసాయేతర ఉపాధి పొందగలుగుతారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక సమూహాలు ఏర్పడుతున్నందున గ్రామీణ కుటుంబ ఆదాయాలను స్థిరీకరించడానికి ప్రాంతీయ ంగా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు పారిశ్రామిక మూలధనం యొక్క వికేంద్రీకరణ, గ్రామీణ కుటుంబ ఆదాయాలను స్థిరికరించడానికి మరింత సముతల్య ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిం చేందుకు సహాయపడుతుంది.

# 2 వేల కోట్లు రిలీజ్

>> చేశారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, గత నెల 29న మొదటి విడతగా రూ. 2వేల కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం, రెండో విడతలో మరో రూ. 2 వేల కోట్ల నిధులను తాజాగా విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం చెల్లించి, వారి ఖాతాలను పూర్తిగా క్లియర్ చేసింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల ఖాతాల్లో ఎలాంటి పెండింగ్‌లు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. అదేవిధంగా, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి సెప్టెంబర్ 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. పెండింగ్‌లో ఉన్న రూ. 10,000 లోపు విలువ కలిగిన చిన్న మొత్తాల బిల్లులన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించింది. ఈ విభాగంలో దాదాపు 5 లక్షలకు పైగా ఉన్న టోకెన్లను గుర్తించి, ఏమాత్రం జాప్యం లేకుండా చెల్లింపులు జరిపారు. రాబోయే రోజుల్లో మిగిలిన బకాయిలను కూడా క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించారు.

## వారం - వర్జ్యం

30-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పాడ్యమి ఉ.7.39
పూర్వాషాఢ పూర్తి
వర్జ్యం : మ.2.46-సా.4.34
దు.ఉ.8.14-ఉ.9.06, 2) రా.11.58-రా.12.50
శుభసమయం : ఉ.9.30-ఉ.10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** నూతన విద్యా ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. వాహనాల విషయంలో మెలకువలో వ్యవహరించండి.

**వృషభం:** సంఘంలో ఓ ప్రత్యేకత గౌరవం పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు. పెట్టుబడులకు అనుకూల సమయం.

**మిథునం:** ప్రకృతి వైద్యం, ఆయుర్వేద వైద్యం పట్ల ఎక్కువ దృష్టి సాధించ గలుగుతారు. కుటుంబసమస్యలు తీరుతాయి.

**కర్కాటకం:** బంధువులతో వ్యక్తిగత విషయాలపై సంప్రదిస్తారు. అధికార హోదా కలిగిన వ్యక్తులతో పరిచయం.

**సింహం:** ఫలితములు మీ చేతికి అందక పోయినా కనుచూపు మేరలోనే మీ కృషికి తగిన ఫలితం కనిపిస్తుంది. వస్త్రలాభం.

**కన్య :** స్వయం కృతాపరాధములు, పొర పాటు నిర్ణయాలు, నోరుజారుట వంటివి సంభవించ కుండా జాగ్రత్త వహించండి.

**తుల:** వివాహాది శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైనా ఆటంకాలు అధిగమిస్తారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**ధనుస్సు:** మీ మౌనము మీ సహనము మీకు మేలు చేస్తాయి. శారీరకంగా, మానసికంగా అలసట అధికమవుతాయి. వస్త్ర లాభం.

**మకరం:** ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపులను కాస్త ఆలస్యంగా చెల్లిస్తారు. సమాజములో మీకు గౌరవ ప్రతిష్ఠలు పెంపొందుతాయి.

**కుంభం:** మీ నమ్మకము కన్నా మీ ఇంటిలోని వారి ఊహే నిజమవుతుంది. శ్రమ అధికమవుతుంది. వాహనసౌఖ్యం.

**మీనం:** సంతాన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెద్ద మొత్తాలను డిపాజిట్ చేసేందుకు చికాకులు ఎదురుఅవుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




న్యూయార్క్‌లో సోమవారం 57వ వార్షిక ఎన్‌వైసి ప్రైడ్ మార్చ్ దృశ్యం

# 'జీరాంజీ' చట్టాన్ని విరమించండి

>> అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే 2 సార్లు సమావేశమై అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిందని తెలిపారు. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

గతంలో ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతన భారం 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించేదని, మెటీరియల్ కాంపోనెంట్‌లో కూడా కేంద్రం 75 శాతం వాటా కల్పించేదని గుర్తు చేశారు. కొత్త విధానంలో 60:40 నిష్పత్తి అమలు చేయడం వల్ల రాష్ట్రాలపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వాటా కొన్ని వందల కోట్ల రూపాయల పరిధిలో ఉండగా, కొత్త విధానంలో తెలంగాణ వాటా సుమారు రూ.2,000 కోట్ల వరకు పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వీబీజీ రామ్‌జీ చట్టంలో ప్రతిపాదించిన కొన్ని నిబంధనలు పేదలు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టాన్ని తీసుకురావడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. చట్టానికి పేరు మార్చడమే కాకుండా, అమలులో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక బాధ్యతలు మోపడం సరైన విధానం కాదన్నారు.

అదేవిధంగా తెలంగాణకు సంబంధించిన ఇతర కీలక అంశాలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజన కింద రెండు సంవత్సరాల క్రితమే తెలంగాణ ప్రభుత్వం లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి కేంద్రానికి పంపించినప్పటికీ ఇప్పటికీ ఇళ్ల మంజూరు జరగలేదని, వెంటనే ఆమోదం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద తెలంగాణలో మంజూరైన అనేక రహదారి పనులు అటవీ, వన్యప్రాణి అనుమతుల సమస్యలతో నిలిచిపోయాయని తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్లమల, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో రోడ్లు, నివాసాలు, బోర్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కూడా అటవీ అనుమతుల కారణంగా నిలిచిపోతోందని వివరించారు. రోడ్లకు కేంద్రం మంజూరు ఇచ్చినప్పుడే అటవీ శాఖ నుంచి అవసరమైన క్లియరెన్స్‌లు కూడా కల్పించే విధానం తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈ అంశాలపై సానుకూలంగా స్పందించారని, అటవీ అనుమతుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. వీబీజీ రామ్‌జీ చట్టంపై తెలంగాణ ప్రభుత్వ వైఖరి స్పష్టమని, రాష్ట్ర ప్రయోజనాలు, గ్రామీణ పేదల సంక్షేమం, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే మంత్రివర్గం తుది నిర్ణయం ప్రకటిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కొత్త చట్టంలో చేరాలా, వద్దా అనే అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ నిర్ణయం తెలియజేస్తామని మంత్రి తెలిపారు. వీబీజీ రామ్‌జీ చట్టానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన అభ్యంతరాలు, సూచనలను సమావేశంలో మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)ను హక్కు ఆధారిత కార్యక్రమంగానే కొనసాగించాలని, ప్రతిపాదిత వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త చట్టం గ్రామీణ పేదల పని హక్కును బలహీనపరచడంతో పాటు గ్రామ పంచాయతీల అధికారాలను తగ్గించి, రాష్ట్రాల పాత్రను పరిమితం చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రణాళిక, పనుల ఎంపిక, నిధుల కేటాయింపు, అమలు, పర్యవేక్షణ వంటి కీలక అధికారాలను కేంద్రం వద్దే కేంద్రీకరించడం సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా మాత్రమే నిధుల కేటాయింపు చేయడం సమంజసం కాదని, గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న వాస్తవ ఉపాధి డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని నిధులు కేటాయించాలని తెలంగాణ సూచించింది. గత ఐదేళ్లలో రాష్ట్రాలకు కల్పించిన పని దినాలకు 80 శాతం, ఆర్థిక సంఘం సిఫార్సులకు 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని ప్రతిపాదించింది. కొత్త చట్టంలో కేంద్రం కేవలం 60 శాతం మాత్రమే నిధులు భరిస్తుండగా, మిగిలిన 40 శాతం రాష్ట్రాలపై భారం పడుతోందని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రాయోజిత పథకాల వల్ల రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడి పెరిగిందని, మరింత భారం మోపడం అమలును క్లిష్టతరం చేస్తుందని పేర్కొన్నారు.

# 12 మంది ఐపిఎస్‌ల బదలీ

>> ఆమెకు భద్రాద్రి జోన్ డిఐజిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. (ఈ పోస్టు చాలా కాలంగా ఖాళీగా వు ంది. వరంగల్ కమిషనర్‌గా వున్న సన్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ బాస్‌గా బదిలీ చేశారు. రామగుండం కమిషనర్‌గా వున్న అంబర్ కిషో ర్ ఝాకు కాళేశ్వరం డిఐజిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. (ఈ పోస్టు చాలా కాలంగా ఖాళీగా వుంది) నగర ట్రాఫిక్ బాస్‌గా వున ్న జోయల్ డేవిస్‌కు యాదాద్రి భువనగిరి డిఐజిగా పూర్తి అదనను బాధ్యతలు అప్పగించారు. (ఇంతకు ముందు హైదరాబాద్ రేంజి డిఐజిగా వున్న ఈ పోస్టు కూడా చాలా కాలంగా ఖాళీగా వుంది). నిఘా విభాగంలో వున్న భాస్కరన్‌కు బాసర డిఐజిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్ప గించారు. (ఈ పోస్టు కూడా చాలా కాలంగా ఖాళీగా వుంది). నగర ఎస్‌బి జాయింట్ కమిషనర్‌గా వున్న విజయ్ కుమార్‌కు నగర ఉత్తర మం డల శాంతి భద్రతల జాయింట్ సిపిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. నిఘా విభాగంలో వున్న ఎస్‌పి సింధూ శర్మను సిఐ సెల్ ఎస్‌పిగా బదిలీ చేశారు. సైబరాబాద్‌లో డిసిపిగా వున్న సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే ఎస్‌పిగా నూ, పోలీసు కంప్యూటర్ సైన్స్ లో వున్న రూపేష్‌ను సిఐడికి బదిలీ చేశారు. ఎసిబిలో వున్న ప్రవీణ్ కుమార్‌ను సిఐడికి బదిలీ చేయగా వెయిటింగ్‌లో వున్న వెంకటేశ్వర్లును సిటీ సాయు ధ బలగం డిసిపిగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా వున్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్‌పిగా బదిలీ చేశారు.

# పెట్రోలు, డీజిల్‌పై ఆంక్షలు ఎత్తివేత

## రేపటి నుంచి అమలు

**న్యూఢిల్లీ,జూన్ 29:** దేశంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై విధించిన తాత్కాలిక ఆంక్షలను జూలై 1 నుంచి ఎత్తివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో పాటు దేశంలో ఇంధన లభ్యతపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ నెల ప్రారంభంలో ఈ ఆంక్షలను అమలు చేశారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆంక్షల సమయంలో వాణిజ్య వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల నుంచి ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధించారు. అలాగే ప్రతి వినియోగదారు లేదా వాహనం రోజుకు గరిష్టంగా 200 లీటర్ల డీజిల్ మాత్రమే కొనుగోలు చేసేలా పరిమితి విధించారు. నిల్వలు దాచిపెట్టకుండా నిరోధించడం, దుర్వినియోగాన్ని అరికట్టడం, అందరికీ సరిపడా ఇంధనం అందుబాటులో ఉండేలా చూడడమే ఈ నిర్ణయం ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.ప్రస్తుతం దేశంలో ఇంధన సరఫరా పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ఈ ఆంక్షలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో జూలై 1 నుంచి రవాణా సంస్థలు, పరిశ్రమలు సహా అన్ని వాణిజ్య వినియోగదారులు మళ్లీ రిటైల్ పెట్రోల్ బంకుల నుంచి ఎలాంటి పరిమితులు లేకుండా పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసుకోవచ్చు. రిటైల్ ఇంధన ధరలు, బల్క్ సరఫరా ధరల మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో ఈ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి.

# నేడు దోహాలో అమెరికా-ఇరాన్ చర్చలు

## హార్ముజ్ సమస్య కీలకం

**వాషింగ్టన్, జూన్ 29:** అమెరికా-ఇరాన్ మధ్య కొద్దిరోజులుగా ఉద్రిక్తతలు, పరస్పర దాడులతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణాన్ని తలపించింది. అయితే, తాజాగా ఇరు దేశాలు పరస్పర దాడులను నిలిపివేయడానికి అంగీకరించాయి. దీంతో తాత్కాలిక ఊరట లభించింది. అలాగే, ఇరు దేశాల మధ్య దెబ్బతిన్న శాంతి ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు మంగళవారం ఖతార్ రాజధాని దోహాలో ఉన్నతస్థాయి చర్చలు జరపాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. కీలకమైన హార్ముజ్‌లో నౌకల రాకపోకలపై సాంకేతిక చర్చలు కొనసాగుతున్నందున, ప్రస్తుతానికి ఎలాంటి సైనిక చర్యలు చేపట్టకూడదని ఇరు దేశాలు ఒక అంగీకారానికి వచ్చినట్లు ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'అక్సియోస్' వెల్లడించింది. అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రాత్మక తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిరిన 11 రోజులకే పరస్పరం భారీ దాడులు జరగడం, ఆ వెంటనే ఈ అత్యవసర చర్చఉ ఖరారు కావడం గమనార్హం.

**హార్ముజ్‌పైనే ప్రధానంగా చర్చలు**

దోహాలో జరిగే చర్చల్లో హార్ముజ్ జలసంధి అంశ్రమే ప్రధానం కానుంది. అమెరికా సాంకేతిక బృందం అధిపతి నిక్ స్టెవర్ట్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ముందుగా వాణిజ్య నౌకల రాకపోకలపై ఉన్న విభేదాలను, మిలిటరీ హాట్‌లైన్ ఏర్పాటును పూర్తిస్థాయిలో పరిష్కరించనున్నారు. అయితే హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే ప్రతి నౌక తప్పనిసరిగా తమ అధికారులతో ముందస్తుగా సమన్వయం చేసుకోవాలని ఇరాన్ పట్టుబట్టడం, ఇది ఒప్పంద పరిధిని దాటి వ్యవహరించడమేనని అమెరికా భావించడంతో కుదిరిన ఒప్పందం విచ్ఛిన్నం అయింది. దాంతో కొద్ది రోజులకే మళ్లీ దాడులు మొదలయ్యాయి. ఈ వారాంతంలో అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరిగిన దాడులు పశ్చిమాసియా ప్రాంతాన్ని భయాందోళనకు గురిచేశాయి.

# బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌లతో నితిన్ నబీన్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్29:** బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌లతో నితిన్ నబీన్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. సోమవారం ఉదయం బేగంపేట పర్యాటక భవన్‌లో రామచందర్‌రావు అధ్యక్షతన సమావేశమయ్యారు. భేటీలో అభయ్ పాటిల్, సునీల్ బన్సల్, ఆశిష్ సెల్లార్, రేఖా శర్మ, చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ కమిటీల పనితీరుపై, పార్టీ పరిస్థితి, అధికారంలోకి వచ్చేందుకు చేపట్టాల్సిన అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.

# 36 మంది ఇన్‌స్పెక్టర్లకు డిఎస్‌పిలుగా పదోన్నతులు.. కొత్తచోట్ల పోస్టింగులు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ జిల్లాలలో పనిచేస్తున్న 36 మంది ఇన్‌స్పెక్టర్లకు డిఎస్‌పిలుగా పదోన్నతులు కల్పిస్తూ డిజిపి ఆనంద్ సోమవారం నాడు ఆదేశాలు జారీ చేశారు. వెను వెంటనే వీరందరికి కొత్త ప్రాంతాలలో పోస్టింగులు ఇచ్చారు. డిజిపిగా ఆనంద్ బాధ్యతలు చేబట్టిన తరువాత ఇంత పెద్ద ఎత్తున ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులు ఇవ్వడం, వారికి కొత్తచోట్ల పోస్టింగులు ఇవ్వడం ఇదే తొలిసారి. పరిపాలనా క్రమంలో భాగంగా ఈ బదిలీలు జరిగినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నా పోలీసు విభాగంలో అక్రమార్కులపై కొరడా ఝుళిపించేందుకే డిజిపి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పదోన్నతులు పొందిన వారిలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫోర్త్ సిటీ కమిషనరేట్ల సహా పలు జిల్లాలకు చెందిన వారితో పాటు ఇతర విభాగాల అధికారులు వున్నారు. బదిలీ అయిన వారు వెంటనే కొత్త పోస్టుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పదోన్నతులు పొందిన అధికారులు డిజిపి ఆనంద్‌ను డిజిపి కార్యాలయంలో మధ్యాహ్నం సమయంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని నిజాయితీగా పనిచేయాలని, పోలీసు శాఖకు మంచిపేరు తేవాలని డిజిపి కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్ కూడా పాల్గొన్నారు.



పదోన్నతులు పొందిన అధికారులతో డిజిపి ఆనంద్. శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్

# గుర్తింపులేని క్రికెట్ సంఘం టోర్నమెంట్లు నిర్వహిస్తోంది: హెచ్‌సిఎ

**హైదరాబాద్ (ఉప్పల్), జూన్ 29, ప్రభాతవార్త :** బిసిసిఐ గుర్తింపు లేని ఒక క్రికెట్ సంఘం, అధికారిక గుర్తింపు, రాజ్యాంగబద్ధ హోదా లేకుండానే గుర్తింపు పొందిన క్రికెట్ సంఘాల పేర్లను దుర్వినియోగం చేస్తూ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తోందని హెచ్‌సిఏ అధికార ప్రతినిధి శేష్ నారాయణ్, సిఇఒ ఇంతియాజ్‌ఖాన్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ), హైదరా బాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ), తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ పేర్లు మరియు వాటి అనుబంధం ఉందంటూ తప్పుడు ప్రచారం చేస్తూ కొన్ని టోర్నమెంట్లు నిర్వహించడం తీవ్ర రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం క్రికెట్ పరిపాలనకు సంబంధించిన వివాదం కాదని, మోసం, ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన, అధికారిక క్రికెట్ రికార్డుల విశ్వసనీయతకు సంబంధించిన అత్యంత తీవ్రమైన అంశమని స్పష్టం చేశారు. అధికారిక గుర్తింపు లేకుండా గుర్తింపు పొందిన క్రికెట్ సంస్థల పేర్లను ఉపయోగించడం ద్వారా ఆటగాళ్లు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్పాన్సర్లు మరియు క్రికెట్ అభిమానులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అక్రమ చర్యలు అధికారిక క్రికెట్ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని, యువ క్రికెటర్ల భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.




ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న హెచ్‌సిఎ అధికార ప్రతినిధి శేష్‌నారాయణ్, సిఇఒ ఇంతియాజ్‌ఖాన్ తదితరులు

# సహకార బ్యాంకులు రైతులకు ఆర్థిక మూలస్తంభాలు

## వ్యవసాయ మంత్రి నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** సహకార బ్యాంకులు పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను అందించడం ద్వారా రైతులకు, గ్రామీణ సమాజాలకు ఆర్థిక మూలస్తంభాలుగా పనిచేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) శాఖ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించిన తదుపరి మాట్లాడుతూ సహకార బ్యాంకుల అభివృద్ధి రైతుల ఆదాయాలు మెరుగుపడటంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. సకాలంలో రుణాల చెల్లింపులు బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసి, మరింత మంది రైతులకు రుణాలను అందించడానికి వీలు కల్పిస్తాయని చెప్పారు. కార్యకలాపాలను విస్తరించడానికి వ్యాపారులు, ప్రజల నుంచి డిపాజిట్లను ప్రోత్సహించాలని బ్యాంకు అధికారులను కోరారు.

సత్తుపల్లిలో సమీకృత సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఒక ప్రతిపాదన సమర్పించబడిందని తెలిపారు. వేమ్సూర్‌లో ఏర్పాటు కానున్న పామాయిల్ ఫ్యాక్టరీ ఉపాధిని కల్పిస్తుందని, అలాగే ఖమ్మం-అశ్వారావుపేట రహదారిని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా ఉన్నతీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించినట్లు వెల్లడించారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నియోజకవర్గానికి అభివృద్ధి అవకాశాలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతాయని ఆయన అన్నారు. ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే సహకార బ్యాంకు తక్కువ వడ్డీ రేట్లకే రుణాలు అందిస్తుందని వివరించారు. రైతులు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు.



న్యాయవాదులతో కలిసి వచ్చి బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో సంతకం చేస్తున్న బాల్క సుమన్

# పోలీసుల ముందు హాజరైన బాల్క సుమన్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 29, ప్రభాతవార్త:** సింగరేణి ఆస్తులను ధ్వంసం చేద్దామంటూ వివాదస్పద వ్యాక్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ సోమవారం బంజారాహిల్స్ ముందు హాజరయ్యారు. వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యంలో బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. కేసును నాంపల్లి నుంచి బంజారాహిల్స్ ఠాణాకు బదలీ చేశారు. బాల్క సుమన్‌ను కస్టడీ కోరుతూ బంజారాహిల్స్ పోలీసులు పిటిషన్ దాఖలు చేసినప్పటికి కోర్టు అనుమతించలేదు. దీనికితోడు బాల్క సుమన్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా షరతులతో కూడిన బెయిలును కోర్టు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే బంజారాహిల్స్ ఠాణాకు ఆయన తన న్యాయవాదులతో కలిసి వచ్చారు. పోలీసుల ముందు సంతకం చేసి వెళ్లారు.

# రాష్ట్రంలో బొగ్గు కొరత

## యాదాద్రి, కెటిపిపి ఒక్కో యూనిట్ మూత

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరత తీవ్రమైంది. దీంతో బొగ్గు కొరత రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లకు పెద్ద సమస్యగా తయారైంది. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో నిర్వహిస్తున్న రెండు ప్లాంట్లలో ఒక్కో యూనిట్ తాజాగా మూతపడినట్లు సమాచారం. నిల్వలు లేకపోవడం వల్ల నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోని ఒక యూనిట్ లో ఉత్పత్తి నిలిచిపోగా, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ) లోని 500 మెగావాట్ల ప్లాంట్ మూతపడింది. 4000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పూర్తిస్థాయిలో నడవాలంటే భారీగా బొగ్గు అవసరం. అయితే సింగరేణి నుండి సరఫరా తగ్గడంతో, 26 రోజుల నిల్వ ఉండాల్సిన చోట కేవలం 31 శాతం లోపు నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల ఒక యూనిట్ లో ఉత్పత్తి ఆగిపోయింది. ఇక భూపాలపల్లిలో ఉన్న కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లోని 500 మెగావాట్ల మొదటి దశ ప్లాంట్ లో బొగ్గు అందకపోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి అవాంతరాలు ఎదురుకానున్న నేపథ్యంలో విద్యుత్ సంస్థలు ప్రత్యమ్నాయ ఏర్పాట్లలో ఉన్నట్లు తెలుస్తోంది. థర్మల్ విద్యుత్ కేంద్రంలో గతేడాది 16 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, ప్రస్తుతం 2.5 లక్షల టన్నులకు పడిపోయినట్లు తెలుస్తోంది. దీనికి తగినట్లుగా పెండిగ్‌లో ఉనన బకాయిలను చెల్లించడం లేదని ఇప్పటికే సింగరేణి సంస్థ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాను నిలిపివేసింది. బొగ్గు కొనుగోలు నిమిత్తం దాదాపు 20 వేల కోట్ల బాకీ ఉన్నట్లు వెల్లడవుతోంది. అయితే నాసిరకం బొగ్గును సరఫరా చేస్తోందనే అభిప్రాయంతో జెన్కో సింగరేణి నుండి బొగ్గు కొనుగోలును నిలిపివేసింది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం సింగరేణి కాలరీస్ థర్మల్ ప్లాంట్లు ప్రామాణిక స్థాయిలలో 19 శాతం బొగ్గు నిల్వలను కలిగి ఉండగా, తెలంగాణ విద్యుత్ 26 శాతం నిల్వలను కొనసాగిస్తోంది, ఈ రెండూ 621.7 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి.

# ఎస్‌ఎఫ్‌ఐ చలో లోక్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

## అర్ధరాత్రి నుండే ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులు

## అక్రమ అరెస్టులకు నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు




**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఛలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. విద్యార్థి నాయకులు లోక్‌భవన్‌కు ప్రయత్నిస్తారని భావించిన పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నుండే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. దీంతో తెలంగాణలో కాంగ్రెస్ పాలనలాగా లేదని, బీజేపీ పాలన లాగా ఉందని సంఘం రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు విమర్శించారు. తమ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా నేడు(మంగళవారం) రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ముట్టడి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం మమత, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిరణ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, అవినాష్, అరవింద్ మరియు రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, తరంగ్, నాగేందర్, అరుణ్, సుబ్బు, సాయి, శ్యామ్, కావ్య తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ వలన నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఆత్మహత్య చేసుకున్న 20 మంది విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో లోక్ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. బీజేపీ అసమర్ధ పాలనపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అర్ధ రాత్రి అక్రమంగా అరెస్టు చేయించారని మండిపడ్డారు. తాము నీట్ పేపర్ లీకేజీపై బీజేపీని ప్రశ్నిస్తుంటే, బీజేపీ వైఫల్యంపై పోరాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజినీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, కరీంనగర్, మహబూబాద్, హన్మకొండ, కొత్తగూడెం, నల్గొండ, సంగారెడ్డి, రంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, మంచిర్యాల, భువనగిరి, భూపాలపల్లి, ములుగు, సిరిసిల్ల జిల్లాలలో అర్ధరాత్రి అక్రమంగా అరెస్టులు చేశారని నాగరాజు తెలిపారు. పోలీసుల నిర్బంధాన్ని సైతం ఛేదించి ఛలో లోక్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. లోక్ భవన్ దగ్గర జరిగిన ముట్టడి కార్యక్రమంలో ఆలిండియా సహాయ కార్యదర్శి ఎం.డి అతిక్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షులు రజినీకాంత్ మాట్లాడుతూ.. దేశంలో నీట్ పేపర్ లీకవడంతో విద్యార్థుల చదువులు, లక్షలాది రూపాయలు డబ్బులు, సమయం వృధా చేసుకున్నారని, 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యత లేకుండా కేంద్ర విద్యాశాఖ మంత్రి వ్యవహరిస్తున్నారని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ వాల్యువేషన్‌లో అవకతవకలు ఇతర ప్రవేశ పరీక్షలు లీక్ అయిన కూడా బీజేపీ ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. పరీక్ష పే, మన్ కీ బాత్ పేరుతో మాట్లాడే ప్రధాని మోదీ ఈ లీక్‌లపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ తక్షణమే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగింపు కార్యక్రమాలను రూపొందిస్తామని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులకు నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ దిష్టి బొమ్మలను దగ్ధానికి పిలుపునిస్తున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టు చేసిన నాయకులను సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సిపిఎం హైదరాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మహేందర్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జావేద్ పరామర్శించారు.

# డిజిపి కార్యాలయం వద్ద నిరుద్యోగ జెఎసి ధర్నా

## పోలీసు నియామకాల సంఖ్య పెంచాలని, వయోపరిమితి సడలించాలని ఆందోళన

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో త్వరలో జరగబోయే భర్తీలను భారీగా పెంచాలని, వయో పరిమితిని సడలించాలని కోరుతూ నిరుద్యోగ జెఎసి సోమవారం నాడు డిజిపి కార్యాలయం వద్ద ధర్నా చేబట్టింది. ఈ సందర్భంగా కొద్దిసేపు డిజిపి కార్యాలయం వద్ద ఉద్రిక్తతలు నెలకొన్నాయి. నిరుద్యోగ జెఎసి పిలుపుకు భారీగా స్పందన రావడంతో ధర్నాలో పాల్గొన్న వారిని నిలువరించేందుకు పోలీసులు ము ందుగానే భారీగా బందోబస్తు కోసం రంగంలో దించారు. పోలీసు శాఖలో త్వరలో ఐదు వేల ఖాళీలను భర్తీ చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడం తెలిసిందే. దీనిపై నిరుద్యోగ జెఎసి తీవ్రంగా స్పందించడం విదితమే. పోలీసు శాఖలో 20 వేలకు పైగా పోస్టులు ఖాళీగా వుంటే ఐదు వేల పోస్టులు భర్తీ చేయడం ఏమిటనీ ప్రశ్నించిన నిరుద్యోగ జెఎసి ఇందులో భాగంగా సోమవారం నాడు ఛలో డిజిపి కార్యాల యానికి పిలుపునిచ్చి పోలీసు రిక్రూట్ బోర్డు ముట్టడికి రంగంలో దిగింది. అయితే దీనిపై ముం దుగానే సమాచారం వున్న పోలీ సులు డిజిపి కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు తలెత్తకుండా వుండేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డిజిపి కార్యాలయ గేట్లను మూసి వేసి రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వుండేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే నిరుద్యోగ జెఎసి పిలుపుకు స్పంది ంచిన నిరుద్యోగులు భారీగా డిజిపి కార్యాలయం వద్దకు తరలిరావడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఒక దశలో డిజిపి కార్యాల యంలో దూసుకువెళ్లేందుకు నిరుద్యోగులు ప్రయత్నించగా పోలీసులు వారిని నిలువరించారు. ఈ సందర్భం గా జెఎసి నాయకులు మాట్లాడుతూ సర్కారు నిరుద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. పోలీసు శాఖలో వున్న మొత్తం ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఇదే సమయంలో కానిస్టేబులల్, ఎస్ఐ పోస్టులకు వయోపరిమితిని సడలించాలని వారు డిమాండ్ చేశారు. భర్తీల విషయంలో పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు సవ్యంగా వ్యవహరిం చాలని, అన్ని విషయాలను ముందుగానే నిరు ద్యోగులకు చెప్పాలని వారు కోరారు. ఒకటి, అరా విషయాలను చెప్పడం వల్ల నిరుద్యోగులు గతంలో నష్టపోయారని వారు గుర్తు చేశారు. తమ డిమాం డ్లను సర్కారు ఆమోదించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కాగా జెఎసి నాయకులను, నిరుద్యోగులను అరెస్టు చేసిన పోలీసులు వారిని సమీప పోలీసు స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



# తల్లిని హత్య చేసి.. ఉరేసుకున్న కుమారుడు

## పెద్దరావులపల్లిలో విషాదం

## కుటుంబకలహాలు, మద్యం మత్తే కారణమా?

**భూదాన్ పోచంపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లిలో చోటుచేసుకున్న తల్లి-కొడుకు మృతి ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వృద్ధురాలైన తల్లిని బండ రాయితో హత్య చేసిన కుమారుడు, అనంతరం భయంతో అదే ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తు న్నారు. మృతులను సంగెం పోచమ్మ (69), ఆమె మూడో కుమారుడు సంగెం శ్రీనివాస్(40)గా గుర్తించారు. శ్రీనివాస్ పదేళ్లుగా కుటుంబంతో కలిసి బోడుప్పల్‌లో నివసిస్తుండగా, ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన పెద్దరావుల పల్లికి వచ్చాడు. ఇంట్లో భార్యతో జరిగిన గొడవ తీవ్రరూపం దాల్చడంతో ఆమెపై దాడి చేసినట్లు సమాచారం. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య వెళ్లిపోవడంతో తీవ్రఆగ్రహం, మనస్తాపానికి గురైన శ్రీనివాస్ మద్యం సేవించి ఇంట్లో ఉన్న తల్లి పోచమ్మతో వాగ్వాదానికి దిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆవేశంలో కొబ్బరికాయలు కొట్టేందుకు ఉపయోగించే బండరాయితో తల్లి తలపై బలంగా మోదడంతో ఆమె మృతి చెందినట్లు సమాచారం. అనంతరం తాను చేసిన హత్య తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందనే భయంతో శ్రీనివాస్ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం తల్లి, కుమారుడు మృతదేహాలు కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్తులను కలచివేసింది. కుటుంబ కలహాలు, మద్యానికి బానిస కావడం తల్లి, కుమారుడు మృతికి దారితీసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల వాంగ్మూలాలను నమోదుచేస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జిఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఎఫ్‌టిజి తొలి తయారీ కేంద్రం ప్రారంభం

**శంషాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** జీఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌కు పూర్తిగా అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ హైదరా బాద్ ఏవియేషన్ ఎస్ఈజెడ్ లిమిటెడ్, జీఎంఆర్ ఏరోస్పేస్ ఇండస్ట్రియల్ పార్క్, హైదరాబాద్‌లో ఎఫ్‌టీజీ (ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్) తొలి భారత తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, జీఎంఆర్, ఎఫ్‌టీజీ సంస్థల ఉన్నత నాయకత్వం హాజరయ్యారు. ఈ ప్రారంభం, ప్రపంచ ఏరోస్పేస్ తయారీ విలువ శ్రేణిలో భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేసే కీలక మైలురాయిగా నిలిచింది. ఎఫ్‌టీజీ భారతదేశంలో కార్య కలాపాలు ప్రారంభించడం ద్వారా కెనడా, అమెరికా, చైనా తర్వాత నాలుగో అంతర్జాతీయ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అధిక కచ్చిత త్వం అవసరమైన ఏరో స్పేస్ ఎలక్ట్రానిక్స్ తయా రీకి భారతదేశం అనువైన గమ్యస్థానంగా ఎదుగుతున్నదనడానికి ఇది మరో నిదర్శనం. కొత్తగా ప్రారంభమైన ఈ కేంద్రంలో అత్యాధునిక ఏవియానిక్స్, కాక్‌పిట్ ఇంటర్ ఫేస్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి చేయబడుతుంది. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్, రక్షణరంగ కార్యక్రమాలకు మద్దతు అందించనున్నాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈఓ అమన్‌కపూర్ మాట్లాడుతూ.. జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఎఫ్‌టీజీ తొలి భారత తయారీ కేంద్రం ప్రారంభం, ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యం కలిగిన ఏరోస్పేస్ తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణంలో కీలక ముందడుగన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీజీ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సీఈఓ బ్రాడ్ బోర్న్ మాట్లా డుతూ.. 'దేశంలో మా తొలి తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం ఎఫ్‌టీజీకి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన మైలురాయి. ప్రతిభావంతులైన ఇంజి నీరింగ్ నైపుణ్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, రక్షణ రంగం, తయారీరంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలు కెనడా, అమెరికా, చైనా తర్వాత భారతదేశాన్ని మా గ్లోబల్ విస్తరణలో తదుపరి గమ్యస్థానంగా మార్చాయన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం, భారత ఏరోస్పేస్ విలువ శ్రేణిని బలోపేతం చేయడంలో భాగస్వాములు కావడం మాకు గర్వకారణం' అని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమగ్ర పారిశ్రామిక ఎకోసిస్టమ్ నిర్మాణం, వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి, అలాగే భారత ఏరోస్పేస్ మరియు రక్షణ రంగ ఆఫ్‌సెట్ లక్ష్యాల సాధనకు మరింత వేగం చేకూర్చేందుకు కట్టుబడి ఉందన్నారు.




ఎఫ్‌టిజి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రతినిధులు

# ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ ఆర్టీసీ)లో గుర్తింపు యూనియన్ ఎన్నికల నిర్వహణపై ఉద్యోగుల్లో నెల కొన్న ఉత్కంఠ, అనుమానాలకు తెరదించుతూ యాజమాన్యం ఎన్నికల ప్రక్రియకు సిద్ధమవుతోంది. యూనియన్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఆర్టీసీ యాజమాన్యం అడుగులు వేగవంతం చేసింది. ఎన్నికల నిర్వహణ అధికారిగా ప్రభుత్వం నియమించిన జాయింట్ లేబర్ కమీషనర్ ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యంతో భేటీ అయి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీ నేపథ్యంలో యూనియన్ వేరిఫికేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.

# పేద క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

## రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** ఆణిముత్యాలు వంటి యువ క్రీడా కారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గౌరవం తెచ్చే విధంగా ఆయా క్రీడలులో తర్ఫీదు ఇస్తామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేనా రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణా జూనియర్ బాస్కెట్ బాల్ లీగ్ ముగింపు ఉత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడానికి సిద్దంగా ఉన్నామని శివసేనారెడ్డి పేర్కొన్నారు. అండర్ 18 బాలురు విభాగంలో వరంగల్ స్టాలియన్స్ 79-77 స్కోరు తేడాతో వికారా బాద్ మాం బాస్‌పై గెలుపొందింది. అండర్ 15 బాలురు విభాగంలో వికారాబాద్ మాంబాస్ జట్టు 101-69 వ్యత్యాసంతో నల్గొండ స్పీడ్ స్ట్రైకర్స్‌పై అద్భు తమైన విజయాన్ని నమోదు చేసింది. అండర్ 18 బాలికల విభాగంలో నిజాం రాయల్స్ జట్టు నల్గొండ స్పీడ్ స్ట్రైకర్స్‌పై 73-66 స్కోరు తేడాతో గెలుపొందారు. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన లీగ్ పోటీలు ఈ నెల 28తో ముగిసాయి.




అండర్ 18 బాలుర విజేత వరంగల్ స్టాలియన్స్ జట్టు

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), హెడ్ క్వార్టర్స్ సర్కిల్ ఖైరతాబాద్, హైదరాబాద్-500004**

నిట్ నం. 04/T1/DEE/SEHQC/AIS Officers Qtrs/K'bagh/2026, తేది: 25.06.2026
1) పనుల పేరు మరియు సుమారు అంచనా కాంట్రాక్ట్ విలువ వివరాలు: హైదరాబాద్, కుందన్‌బాగ్ వద్ద AIS ఆఫీసర్ల క్వార్టర్స్‌కు సమగ్ర మరమ్మతులు, అభివృద్ధిలు, వాటర్ ప్రూఫింగ్, బయట పెయింటింగ్ మరియు ఫ్లోరింగ్, క్లాడింగ్, డాడూయింగ్, ఫాల్స్ సీలింగ్ కలిపి సివిల్ పనులు మరియు ఇతర నిర్వహణలు. ECV: రూ.98,94,114/- (సుమారు). 2) టెండర్ల యొక్క జారీకి చివరి తేదీ మరియు సమయం: 15.07.2026 మ.3.00 గం. వద్ద. 3) టెండర్ల యొక్క స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 15.07.2026 మ.3.30 గం. వద్ద. 4) టెండర్లు తెరచు తేదీ: టెక్నికల్ బిడ్: 15.07.2026 సా.4.00 గం. వద్ద. ప్రైస్ బిడ్: 18.07.2026 మ.1.00 గం. వద్ద. 5) సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) యొక్క పేరు మరియు చిరునామా: శ్రీ I. నరసింగరావు, ME, సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్. ఫోన్: 040-23232762, ఇ-మెయిల్: serb_hqr@yahoo.co.in, తదుపరి వివరాలు: https://tender.telangana.gov.in/ వద్ద. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వద్ద 30.06.2026 నుండి మ.3.00 గం. ఆపై నుండి చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) తరఫున, హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్
DIPR.No.5102-PP/CL/Advt/1/2026-27, తేది: 29.06.2026

hmda
**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్

HMDA చట్టం 2008 యొక్క 15(3) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన
(ప్రభుత్వ మెమో నం. 18514/Plg.I(1)/2025, తేది: 12.06.2026.
HMDA చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008) యొక్క సెక్షన్ 15 యొక్క ఉప-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ G.O.Ms.No. 538, MA & UD, తేది 29.10.2001 ప్రకారం ప్రభుత్వంచే అనుమతింపబడిన (GHMC సర్కిల్-VII, (పాత సర్కిల్ నం.IV) పూర్వపు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఏరియా యొక్క సవరించబడిన అభివృద్ధి ప్లాన్ (మాస్టర్ ప్లాన్)లో ప్రకటించబడిన దానిలో సూచించబడిన భూమి వినియోగానికి ఈ క్రింది ముసాయిదా మార్పు చేయటానికి ప్రతిపాదించడమైనది.
G.O.Ms.No. 538 MA & UD, తేది: 29.10.2001 ప్రకారం ప్రభుత్వంచే అనుమతింపబడిన (GHMC సర్కిల్-VII, (పాత సర్కిల్ నం.IV) హైదరాబాద్ ప్రాంతం యొక్క పూర్వపు మునిసిపల్ కార్పొరేషన్ యొక్క సవరించబడిన అభివృద్ధి ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ప్రకారం ఏదైతే ప్రస్తుతం పబ్లిక్ & సెమీపబ్లిక్ వినియోగ జోన్‌గా నిర్దేశించబడిందో ఆ 3568.75 చ.మీటర్ల యొక్క విస్తీర్ణానికి హైదరాబాద్, ఆసిఫ్‌నగర్ మండలం, ఆసిఫ్‌నగర్ గ్రామం వద్ద ఉన్న ఇ.నం.12-2-837 మరియు 12-2-837/1/A లోని స్థలం ఇప్పుడు నివాసిత వినియోగ జోన్‌గా నిర్దేశింపబడటానికి ప్రతిపాదించబడింది.
పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.
సదరు ప్రతిపాదనలకు ఏ వ్యక్తి లేదా సంస్థ నుండైనా అభ్యంతరాలు/సూచనలు పరిగణింపబడతాయి. వారు అభ్యంతరాలు/సూచనలను లిఖితపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి (15) పదిహేను రోజులలోపుగా HMDA, MCకు గానీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, MA & UD విభాగం, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి గానీ దాఖలు చేయవలెను.
సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (RR), HMDA
DIPR.No.5093-PP/CL/Advt/1/2026-27, తేది: 29.06.2026

వార్త

మాట్లాడటానికి ముందు శ్రద్ధగా వినాలి, రాయడానికి ముందు బాగా ఆలోచించాలి.

-ప్లినీ


# జల'సంధి'కి రాజెవరో తేలేదాకా..?

ఎవరూ వెనక్కి తగ్గలేదు. యుద్ధ సమయంలో సవాళ్లు ప్రతి సవాళ్లుంటాయి. దేశాధినేతలు నోటికొచ్చిందల్లా మాట్లాడి సమస్యల్ని జటిలం చేసుకునే పరిస్థితి ఒక లాగుంటుంది. మొన్నామధ్య పశ్చిమాసియా యుద్ధ మేఘాలకు విరామమేర్పడిందని సందేశం వినిపిస్తే అన్ని దేశాల వారూ సంబరపడిపోయారు. అప్పటికప్పుడు వచ్చే ప్రయోజనమేదీ లేకున్నా అంతర్జాతీయ రవాణా వ్యవస్థ 'హార్మూజ్' చట్రంలో బిగుసుకుపోయే సరికి గిల గిల్లాడి కొట్టుకున్నారు. పశ్చిమాసియా యుద్ధ వైఖరి ఎలా గుందంటే ఒక అడుగు ముందుకేస్తే రెండడుగులు వెనక్కి అన్న చందాన సాగుతోంది. ఏవి తొలి చర్చల్లో ఏవి మలి చర్చల్లో, తుది చర్చలకు దారి ఏర్పడ్తుందా? అవి అమలువుతాయా అన్న సందేహాల మధ్య ఇరాన్‌అమెరికా అధికార బృందాలు చర్చలు సాగాయి. అంతాఅయిపోయి వచ్చే ఆరు నెలల్లో కిక్కురుమనకుండా స్నేహాభిలాషతో కలిసిమెలసి తుదినిర్ణయం తీసుకోవాలని ఉభయ వర్గా లూ అంగీకరించాయి. అడపాదడపా జనం ఊహకందని హెచ్చరికలతో బెదరకొట్టి ఊదరకొట్టే శ్వేతసౌధాధినేత డోనాల్డ్ ట్రంప్ కూడా ఉభయ శ్రేయోదాయక ఒప్పందంపై సంతకాలు పెట్టేశారు. అయినా ఇరాన్ అమెరికా శాంతి ఒప్పందం ముణ్ణాళ్ల ముచ్చటగానే ముగిసింది. తాజా అమెరికా దాడులు హార్మూజ్ జలసంధిలో పనామా దేశ జెండాతో వెళ్తున్న ఎవర్ లౌలీ అనే నౌకపై ఇరాన్ దాడి చేసినందుకే తాము ఎదురు దాడులు చేసినట్లు యు.ఎస్ మిలిటరీ ప్రకటించింది. ఇలా ప్రకటించిన అనంతరం తాము 10 సైనిక లక్ష్యాలపై దాడులు చేసా మని వారి బులెటిన్ పేర్కొంది. ఇరాన్ సైనిక నిఘా వ్యవస్థలు సమాచార ప్రసార వ్యవస్థలు, వైమానిక రక్షణ కేంద్రాలు, డ్రోన్ నిల్వ గోదాములపై అమెరికా దాడులు ముమ్మరం చేసింది. ఈ దాడులకు ప్రతీకారంగా కువైట్ బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలు లక్ష్యంగా తమ నావికా, వైమానిక దళాలు సంయుక్తంగా క్షిపణి, డ్రోన్ ఆపరేషన్లు నిర్వహించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్‌కోర్ సమాధానమిచ్చింది. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా ఒక ఒప్పందం అమలులో ఉండగా వీటిని త్రోసిరాజని దూకుడుని ప్రదర్శించడం యుద్ధనీతి రీతి కాదు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా పూర్తిగా ఉల్లంఘించిందని ఐఆర్‌జిసి ఆరోపించింది. తాము అమెరికా దాడులకు ప్రతీకార దాడులనుమాత్రమే చేసినట్లు వివరణ కూడా ఇచ్చింది. దాడులను ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీద లేకుండా చేస్తామని ట్రంప్ హెచ్చరించగా, ఇకపై కాళరాత్రిని చూపిస్తామని అంతేస్థాయిలో ఇరాన్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. అమెరికా దాడు లకు తమ సమాధానం అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని ఇరాన్ ముందుగానే హెచ్చరించినట్లు గానే. దూకుడుగా యుద్ధ ప్రకంపనలు సృష్టిస్తోంది. కాగా కువైట్, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేయడాన్ని గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ ఖండించింది. ఇలాంటి దాడులను తాము సమ్మతించబోమని హెచ్చరించింది. ఆది నుంచీ ఇరాన్ తమ సార్వభౌమా ధికారాన్ని కొల్లగొట్టే పరిస్థితి వస్తే తాము ఎంతకైనా తెగిస్తామని చెబుతూనే ఉంది. ఎంతో విచిత్రంగా ట్రంప్ తాజా హెచ్చరికలున్నాయి. తన ట్రూత్ సోషల్‌లో ఆదివారం పెట్టిన పోస్టులలో ఇస్లామిక్ రిపబ్లిక్ మొత్తాన్ని నాశనం చేస్తామని ప్రస్తావించారు. హేతుబద్ధంగా వ్యవ హరించలేని పరిస్థితే వస్తే తాము ప్రారంభించిన పనిని సైనికపరంగా పూర్తి చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడ్తుందన్న సంకేతాలను కూడా పంపారు. ఇరు వర్గాలు ఏమాత్రం సంయమనం పాటించకుండా సై అంటే సై అంటూ యుద్ధంలోకి దిగేపరిస్థితులే తీసుకొచ్చారు. శాంతి ఒప్పందాలంటేనే కొత్త ఆశలకు చివుళ్లు పోస్తాయి. కొన్ని సార్లు స్వల్ప ఉల్లంఘనలు జరిగినా, వెనువెంటనే సర్దుకుంటాయి. అది కట్టుబాటు ఉన్న సందర్భాల్లోనే సాధ్యం. కానీ ఇరాన్, అమెరికా శాంతి ఒప్పందంలో తమ దేశ ప్రయోజనాలు మాత్రమే ముఖ్యం అనుకోవ డం వలనే ఉల్లంఘనలకు ప్రాతిపదిక అయింది. చిత్త శుద్ధి లేకుండా చేసుకునే ఒప్పందాలేమీ మనుగడ సాధించలేవు. శాంతి ప్రక్రియకు శాంతి ఒప్పం దంలోని భాగస్వామ్య దేశాలే సహకరించనప్పుడు శాశ్వత శాంతి ఎలా లభిస్తుందో ప్రాతినిధ్య దేశాలే యోచించు కోవాలి. పైగా పరస్పర విశ్వాసం పాదుగొల్పలేనప్పుడు ఒప్పందాలు ఎన్ని సజీవంగా ఉన్నా ప్రయోజనాలు సాధించవు. కేవలం సైనిక లేదా భద్రతచర్యల ద్వారా శాంతి ప్రక్రియ మొదలౌతుందని, అదే సుస్థిర శాంతికి, శాశ్వత శాంతికి దోహదపడుతుందని భావిస్తారు. కానీ తాజాపరిస్థితులను బట్టి ఒప్పందం నిలవదు. శాంతి పొసగదు. ఒమన్ తీరానికి చేరువగా హార్మూజ్‌కు కొత్త రవాణా మార్గాన్ని విస్తరించేందుకు అమెరికా నౌకాదళం నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలను ఆపాలని ఇరాన్ కోరుతోంది. ఆ జలసంధి మార్గం కూడా తమదేనని ఇరాన్ ఆకాంక్ష. హార్మూజ్‌పై ఎవరి జోక్యాన్ని ఇరాన్ సహించ లేక పోవడమే శాంతి ప్రక్రియకు విఘాతం కలిగించింది. అది తేలితేనే కానీ శాంతికి మార్గం సుగమం కాదు. యుద్ధం శాశ్వత ముగింపు కోసం అమెరికా ఇరాన్‌ల మధ్య సాగుతున్న చర్చలకు ప్రతిష్టంభనే ఏర్పడే పరిస్థితి వస్తే మళ్లీ ప్రపంచం యావత్తూ చిక్కుల్లో పడినట్లే. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నాయని సంబరపడిన వేళ మళ్లీ భీకర యుద్ధం తప్పదేమోనన్న అంచనాలతో జనం ఉలిక్కి పడ్డారు. ఏదైనా ఇరువర్గాలు సంయమనంతో వ్యవహరించడం మేలు.



నీది కాదని తెలిసిన దాన్ని కూడా నీదనుకోవడం నిజంగా నేరం.

-ఠాగూర్



చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.

-వి.జాన్సన్

## ప్రజావాక్కు



### పక్కారోడ్లే ప్రాణాధారం

గ్రామీణాభివృద్ధికి పక్కా రోడ్లు ప్రాణాధారం. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ముందుగా రవాణాసౌకర్యం మెరుగుపడాలి. ఆంధ్రప్రదేశ్,తెలంగాణరాష్ట్రాల్లో అనేక గ్రామాలకు ప్రధాన రహదారులు చేరినప్పటికీ, ఇప్పటికీ కొన్ని మారుమూల గ్రామాలుమట్టి రోడ్లపైనే ఆధారపడుతున్నాయి. వర్షాకాలంలో ఈరోడ్లు బురదమయంగా మారి ప్రజలు, విద్యార్థులు,రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కారోడ్లు ఉంటే వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్లకు వేగంగా చేరతాయి. అత్యవసర వైద్యసేవలు గ్రామాలకు సులభంగా అందుతాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరగలుగుతారు. పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు కూడా గ్రామీణప్రాంతాలకు విస్తరించి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.గ్రామీణ పర్యాటకానికికూడామెరుగైనరహదారులుఎంతోదోహదపడతాయి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనతో పాటు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న గ్రామీణ రహదారుల అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలి.రోడ్ల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భారతరత్న మాటే మరిచారు!

ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజల మన్ననలను పొంది అలాగే అప్పటి 'నేషనల్ ఫ్రంట్' చైర్మన్‌గా ఉంటూ ఆనాడు కేంద్రంలో చక్రం తిప్పిన మన ఆంధ్రుల తెలుగుజాతి ఎప్పటికీ గర్వించదగ్గ గొప్ప వ్యక్తి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు. ఆనాడు తెలుగు దేశం పార్టీని స్థాపించి అప్పట్లోనే ఎంతో ప్రజా చైతన్యం కలిగించిన వ్యక్తి మన స్వర్గీయ ఎన్టీఆర్ గారికిఇంతవరకూ'భారతరత్న' ప్రకటించకపోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ విషయం పై సరియైన నిర్ణయం తీసుకుని స్వర్గీయ ఎన్టీఆర్‌కు వేంటనే 'భారతరత్న' ప్రకటించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### యువత ప్రశ్నించాలి

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధివైపు నడిపించడానికి ప్రభుత్వ అధికారులను, పాలకవర్గాలను గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు సమస్యల పట్ల నిరంతరం ప్రశ్నిస్తేనే గ్రామ ప్రజలు అభివృద్ధి, ఆర్థిక బాటలో నడిచే అవకాశంఉంది.పాలకులనుప్రశ్నిద్దాం.అభివృద్ధిచేసుకుందాం..

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ధరల నియంత్రణలో విఫలం

ధరలను తగ్గించుట చేతకాక అవి కొనొద్దు,ఇవి కొనొద్దు విమానాలు ఎక్కి దూర ప్రయాణాలు చేయొద్దు కార్యాలయాలకి టూ వీలర్, ఫోర్ వీలర్ మీద కాకుండా సైకిళ్ల మీద వెళ్లండని ఖర్చులుతగ్గించుకోండని పొదుపు పాటించడంటూ ఉచిత సలహాలిచ్చారు బిజెపి పాలకులు. ఏసౌకర్యాలు లేని కాలంలో కట్టెల పొయ్యి మీద వండుకుతినే వారు ప్రజలు. చాన్నాళ్ల తరువాత వారికి మళ్లీ అలాంటి స్థితిదాపురించింది. ఏ యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదు. నల్లధనం వెనక్కి తీసుకురాలేదు. బ్యాంకుఖాతాల్లో 15లక్షల రూపాయలు జమ చేయలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అధికారంలోకి వచ్చినప్పటినుంచి నిత్యావసర వస్తువుల ధరలు పెంచేస్తూ ప్రజలను ఆర్థికంగా కృంగదీస్తున్నారు. పుష్కర కాలం నుంచి ప్రతిపక్ష పార్టీలను, దివంగత ప్రధానులను విమర్శిస్తున్నారు.

- మిథునం, హైదరాబాద్

### బ్రిటన్ నాయకత్వ మార్పుల పరంపర

కీర్ స్టార్మర్ నిష్క్రమిస్తున్నట్లు వస్తున్న వార్తలు, ఆయన తర్వాత సమర్థుడైన వారసుడిగా ఆండీ బర్న్‌హామ్ పేరు తెరపైకి రావడం బ్రిటిష్ రాజకీయాల్లో మళ్లీ కొనసాగుతున్న అస్థిరతను ఎత్తి చూపుతున్నాయి. గత దశాబ్దకాలంలో యునైటెడ్ కింగ్‌డమ్ అసాధారణంగా ఎక్కువ మంది ప్రధాన మంత్రుల మార్పును చూసింది. ఇదిరాజకీయ కొనసాగింపు, పరిపాలనపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎన్నికల ఓటములు, సొంత పార్టీలోనే నెలకొన్న అసంతృప్తి కారణంగా స్టార్మర్ తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాల మార్పులు,వలసలు,జీవన వ్యయసంక్షోభం,క్షీణిస్తున్న ప్రజా సేవలు వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో ఆయన విఫలమయ్యారని పేర్కొంటూ చాలా మంది లేబర్ పార్టీ సభ్యులు ఆయన నాయకత్వాన్ని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. బ్రిటన్ ఇటీవలి చరిత్ర ఈ సవాలును ప్రతిబింబిస్తుంది.

- టి. సంతోష్ కుమార్, ఇల్లందు

### గతం గతః

ఎమర్జెన్సీ అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని జూన్ 25న ఇందిరాగాంధీని అంబేద్కర్‌ని అవమానించారంటూ ఏప్రిల్ 14న నెహ్రూని ఎప్పుడో దశాబ్దాల నాటి విషయాలను బిజెపి నాయకులు గుర్తు చేసుకుంటూ మాజీ ప్రధానులను విమర్శిస్తూ ఉన్నారు. ఇది సమంజసంకాదు. వారేమీ దేశ ద్రోహులు కాదు. గొప్ప దేశభక్తులు. నెహ్రూ స్వాతంత్ర్య పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు.ఎన్నోసార్లు జైలుకి వెళ్లారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఎఐ మనిషి మేధోవికాస సాధనం కావాలి

*మానవీయ విలువలను, మనిషి గౌరవాన్ని దిగజార్చే ఏ శాస్త్ర విజ్ఞానం మనం అతిగా వాడగూడదు! ప్రపంచంలోని అన్ని దేశాల నాయకులు ఈసందర్భంగా ఒక నిర్ణయం ఏకగ్రీవంగా తీసు కోక తప్పదు ఎ.ఐ చుట్టూ తిరిగేందుకు మనిషి సిద్ధంగా ఉండనవసరం లేదు. మనిషి చెప్పినట్లు చేస్తూ మనిషి చుట్టూ తిరిగే 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' మాత్రమే అవసరం! ఈ సందర్భంగా ప్రధాని మోడీ అన్నమాటలు ఎంతో విలువైనవి సముచితమైనవీ! పారిస్లో జూన్‌నెలలో జరిగినఇండియా ఎఐ ఇంపాక్ట్ సమావేశంలో మాట్లాడుతూ 'బలమైన అమలు చేసే రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ అవసరం అంతేగాని ఎవరికి వారు తోచిన రీతిలో పద్ధతికి కట్టుబడకుండా ఎ.ఐని వాడే పరిస్థితి వుండగూడదు' అన్న ప్రధాని సందేశంలో కర్తవ్యబోధన వుంది! తు.చ. తప్పకుండా ఆ సందేశాన్ని అనుసరించగలుగుతే 'ఎ.ఐ' మానవాళికి వరంగా మారుతుంది! మానవ మేధస్సుకు సహాయకారిగా భాసిల్లుతుంది!*



రావులపాటి సీతారాంరావు

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మనిషి మేధస్సును ప్రశ్నించే స్థితిలో వుందని ఆధునిక ఆలోచనా పరులు జోస్యం చెబుతున్నారు. ఆధునికత, కంప్యూటర్ విజ్ఞానం, మార్పుల జోస్యం, అన్నీ ప్రపంచంలోని మానవాళికి తెలియజెప్పింది మనిషి మేధస్సే! భస్మాసురుడికి వరమిచ్చిన దేవుడినే భస్మం చేయాలని ప్రయత్నించటం ఇతర దేశస్థులకు తెలియకపోయినా విజ్ఞాన వీచికలను దిశ దిశలా వ్యాపింపచేసిన భారతీయులకు ఈ ఇతిహాసం ఏమిటో తెలుసుకదా! అలాగే ఎ.ఐని ఏవిధంగా వినియోగించుకోవాలో మన పండితులకు విజ్ఞానులకు తెలిసిన మాదిరి, ప్రపంచంలోని అందరికీ తెలుసనే భావించాలి! కంప్యూటర్ యుగంలో మన ప్రమేయం లేకుండా అన్నీ కంప్యూటర్ ద్వారా మేమే సృష్టించాం అని చెప్పుకుంటే తప్పుపట్టాల్సిన అవసరం లేదు కానీ మనం సృష్టించిన మన ఎ.ఐ మననే మ్రింగే పరిస్థితి రాకూడదు. అణు బాంబును కనుక్కోవటంతో పాటు అణుశాస్త్ర అధ్యయనం వల్ల మానవాళికి శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం లభించింది! లాభాల వినియోగం వల్ల కేవలం విధ్వంసమే కాదు ప్రజలకు మేలు చేకూర్చే విధంగా అణుశాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగించుకోవచ్చు అని తెలిసొచ్చింది! ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు వల్ల పర్యావరణ మార్పులూ,స్థిరత్వం, అంచనాలతో పాటు వాతావరణాన్ని ముందుగానే పసిగట్టి తగు జాగ్రత్తలు తీసుకోవచ్చు. అయితే మానవాళి నిజమైన, స్వభావ స్వరూపాలను హరించివేసే విధంగా ఎ.ఐను వాడుకోటానికి ఎవరైనా సాహసిస్తే, ప్రపంచ భవిష్యత్తు అంధకారమవుతుంది అన్న భయం శాస్త్రజ్ఞులు, సాంకేతిక విషయాల పండితుల చర్చల వల్ల కలుగుతున్నది. కొంతమంది ఎ.ఐ ప్రొగ్రెస్కు కొంతకాలం ఆటవిడుపు ఇచ్చి తదుపరి పరిశోధనలు వాయిదా వేస్తే బావుంటుందని కూడా భావిస్తున్నారు! కానీ అలా సలహాలు ఇవ్వటానికి ఈ శాస్త్రజ్ఞులకు ఏవిధమైన హక్కు వుంది? కొత్త విషయాలను కనిపెట్టే సత్తా, సంపదా వున్నప్పుడు ఏదో సాకు చెప్పి 'ఎ.ఐ మొత్తం ప్రపంచ వినాశనానికే దారితీస్తుందని ఏ ఆధారంతో చెప్పగలరు? ఇలాంటి ఆలోచనలకు స్వస్తి చెప్పి ఏవిధంగా ఎ.ఐ చెడు మార్గాలను అవలంభించకుండా వుండేందుకు మానవాళి ఎలాంటి చర్యలు తీసుకోవాలి!' అన్న ప్రశ్నకు జవాబుగా మొత్తం ప్రపంచంలోని దేశాలన్నిటినీ ఒక త్రాటి మీద నడిపించి, సమగ్ర అవగాహన తెచ్చుకొని ఒక విధంగా ఏకగ్రీవంగా ఆ ప్రపోసలను ఆమోదించినప్పుడే ఎ.ఐ నియంత్రణ ప్రపంచ వ్యాప్తంగా కొంతలో కొంతైనా సాధ్యపడే అవకాశం వుంది! మానవ మేధస్సును ఈ సందర్భంగా తక్కువచేసి మాట్లాడాల్సిన అవసరం లేదు! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌అనేది మనిషి కనుగొన్నదే! ఏ కొత్త విషయం ప్రపంచం ముందుకు వచ్చినా అది మనిషి మేధస్సు వలన వచ్చిందే అన్న ప్రాథమిక సూత్రాన్ని అంగీకరించినప్పుడు




శాస్త్రజ్ఞులకు కంప్యూటర్ విజ్ఞులకూ, ఆధునిక సాంకేతిక నిపుణులకు తమ మీద అపనమ్మకం పోయి విశ్వాసం రెట్టింపు ఉత్సాహంతో సొంతమవుతుంది! కొత్త వ్యూహాలతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగిస్తే మానవ జాతి పురోగతికి సగటు వ్యక్తికి కావల్సిన సామాజిక, సాంకేతిక సదుపాయాల ఉత్పత్తికి క్షణాల్లో మార్గం ఏర్పడుతున్నది! ముఖ్యంగా మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలతో ఎ.ఐ మనిషికంటే బాగా సమస్యలను పరిష్కరించే సరియైన నైపుణ్యంతో ఉపయోగపడ్తుంది! ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగాలకు మానవత్వం, నైతిక విలువలతో కూడిన విజన్‌ను సమకూరుస్తేనే అనుకున్న రీతిలో ఫలితాలు రాబట్టగలం. లేకపోతే మనిషి చేయిదాటిపోయి సామర్థ్యాలతో కూడిన పనితనం విధ్వంస ధోరణిలో మనిషికి బదులు రాక్షసత్వం బయటకు వస్తుంది! టెర్రీ ఈగల్‌టన్ అనే శాస్త్రవేత్త ఎ.ఐని గురించి చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకోవాల్సి వస్తుంది! 'అమర్చిన కంప్యూటరైజ్డ్ ఇంటలిజెన్స్‌తో మితిమీరిన విశ్వాసం మెషనరీలో కూర్చబడుతే వెనుకటి గ్రీక్స్ ఆకాశం వైపు చూస్తూ చేతులెత్తేసిన వైనం గుర్తుకు రాక తప్పదు. అందుకే మితిమీరిన విశ్వాసం ఎ.ఐ మీద వుంచుతే మొదటికే మోసం వస్తుంది! సాంకేతిక నైపుణ్యం చట్టుబండలుగా మారుతుంది!' ఒక స్పానిష్ ఫిలాసఫర్ ఎ.ఐ పనితనం సందర్భంగా ఒకటి చెప్పారు 'ఇప్పటికే మనిషికి తనమీద తనకే అపరిమితమైన నమ్మకాన్ని తన తెలివితేటల మీద మితిమీరిన విశ్వాసాన్ని ఏర్పరుచుకొని, ఎ.ఐ నాచేతిలో కీలుబొమ్మ అంతే వుంటుంది అన్న అనవసరపు విశ్వాసంతో ఈ ఎ.ఐ నైపుణ్యాన్ని సాంకేతికంగా మరీ బలోపేతం చేస్తున్నాడు! దాంతో మరోదారి ఎ.ఐ పట్టి ఘోరమైన ఫలితాలు మానవాళి మూటకట్టుకొనే ప్రమాదం వుంది!' పెక్కు దేశాల మత గురువులు ఎ.ఐ ను గురించి ప్రస్తావిస్తూ మనిషికి ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను రక్షించే అవసరం గూడా ఏర్పడవచ్చు! ఆ ఒక్క హెచ్చరిక చాలు ఎ.ఐ ప్రయోగాల వల్ల అనుకూల ఫలితాలు ప్రజల ప్రగతి కోసం ఉపయోగపడే రీతిలో ఏర్పరుచుకోగల్గాలి! అంతేగాని ఎ.ఐని కనిపెట్టిన విజ్ఞాన వేత్తలు తమ గొయ్యి తామే త్రవ్వుకొనే విధంగా ఎ.ఐని ఉపయోగించుకోకూడదు! సహజరీతిలో మనిషి వుండాలి! ప్రకృతికి విరుద్ధంగా నడుచుకోగూడదు! విశ్వామిత్ర సృష్టి వల్ల ప్రయోజనం వుండదని భారత పురాణ గాథలు ఇప్పటికే చెప్పాయి! ఎ.ఐ వల్ల కలిగే లాభాలు విభాగాల వారీగా సమీక్షించుకొని పరిమిత రీతిలో రాబట్టుకోవాలి! మనిషి సాధనలో, పనిలో మరో చేయిగా సహకరించే విధంగానే ఎ.ఐని శాస్త్రవేత్తలు తీర్చిదిద్దాలి! ఒకవేళ ఏ కారణం చేతనైనా ఎ.ఐ ప్రయోగాలు వికటిస్తే శాస్త్రవేత్తలు వెనక్కు తీసుకోవటానికి విరుగుడు సదుపాయాలు గూడా అమర్చుకోక తప్పదు! మానవీయ విలువలను, మనిషి గౌరవాన్ని దిగజార్చే ఏ శాస్త్ర విజ్ఞానం మనం అతిగా వాడగూడదు! ప్రపంచంలోని అన్ని దేశాల నాయకులు ఈసందర్భంగా ఒక నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకోక తప్పదు ఎ.ఐ చుట్టూ తిరిగేందుకు మనిషి సిద్ధంగా ఉండనవసరం లేదు.మనిషి చెప్పినట్లు చేస్తూ మనిషిచుట్టూ తిరిగే 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' మాత్రమే అవసరం! ఈ సందర్భంగా ప్రధాని మోడీ అన్నమాటలు ఎంతో విలువైనవి సముచితమైనవీ!పారిస్లో జూన్‌నెలలో జరిగినఇండియా ఎఐ ఇంపాక్ట్ సమావేశంలో మాట్లాడుతూ 'బలమైన అమలు చేసే రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ అవసరం అంతేగాని ఎవరికి వారు తోచిన రీతిలో పద్ధతికి కట్టుబడకుండా ఎ.ఐని వాడే పరిస్థితి వుండగూడదు' అన్న ప్రధాని సందేశంలో కర్తవ్యబోధన వుంది! తు.చ. తప్పకుండా ఆ సందేశాన్ని అనుసరించగలుగుతే 'ఎ.ఐ' మానవాళికి వరంగా మారుతుంది! మానవ మేధస్సుకు సహాయకారిగా భాసిల్లుతుంది! ●

# వర్షం వెనుకడుగు... రైతుకు ముందడుగు ఎప్పుడు?

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన వ్యవసాయం ప్రకృతి అనుగ్రహంపై అధికంగా ఆధారపడుతోంది. ముఖ్యంగా ఖరీఫ్ పంటల సాగు పూర్తిగా నైరుతి రుతుపవనాలపై ఆధారపడి ఉంటుంది. ప్రతిఏడాది జూన్‌నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలు రైతులకు ఆశాజ్యోతిగా నిలుస్తాయి. అయితే ఈఏడాది నమోదవుతున్న లోటు వర్షపాతం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.వర్షాలు ఆలస్యంగా కురవడం, కొన్నిప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడం వల్ల ఖరీఫ్‌సాగు ఆలస్యమవుతోంది.దీనివల్ల లక్షలాది మంది రైతులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి మరింత కొనసాగితే వ్యవసాయం మాత్రమే కాకుండా దేశ ఆహారభద్రత పైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. భారతదేశంలో సుమారు సగానికి పైగా సాగుభూమి ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. చిన్న,సన్నకారు రైతులకు బోర్లు, కాలువల ద్వారా నీటి సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వారు పూర్తిగా వర్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. వర్షాలు ఆలస్యమైతే విత్తనాలు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే విత్తిన విత్తనాలు తగిన తేమ లేక మొలకెత్తకపోవడం లేదా ఎండిపోవడం జరుగుతుంది. దీని వల్ల రైతులు మళ్లీవిత్తనాలు కొనుగోలు చేయాల్సి రావడం, అదనపు పెట్టుబడి పెట్టాల్సి రావడం వారి ఆర్థిక భారాన్ని మరింత పెంచుతుంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాలు,వేరుశెనగ వంటి పంటలు సాగు చేస్తారు. ఈ పంటల దిగుబడితగ్గితే దేశంలో ధాన్యోత్పత్తి తగ్గే అవకాశం ఉంది. ఉత్పత్తి తగ్గడం వల్ల మార్కెట్లో ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం మరింత అధికమై సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార పదార్థాల ధరల పెరుగుదల తీవ్రఇబ్బందులను కలిగిస్తుంది. ఈ విధంగా లోటు వర్షాల ప్రభావం రైతులకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంపైనా పడు



తుంది.వాతావరణ మార్పులు కూడా ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా మారుతున్నాయి. ఒకప్పుడు క్రమపద్ధతిలోకురిసే వర్షాలు ఇప్పుడు అసమానంగా కురుస్తున్నాయి.కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి కనిపిస్తోంది. ఒకేసారి భారీ వర్షాలు కురిసి వరదలు సృష్టించడం, తరువాత దీర్ఘకాలం వర్షాలు లేకపోవడం వంటి పరిస్థితులు పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి.ఈ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం వేగంగా స్పందించడం అత్యంత అవసరం. మొదటగా నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించడం, వర్షపు నీటిని నిల్వ చేసే నిర్మాణాలను విస్తరించడం, భూగర్భ జలాలను పునరుద్ధరించే చర్యలను వేగవంతం చేయాలి. సూక్ష్మ సాగునీటి పద్ధతులైన డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను మరింత ప్రోత్సహించాలి. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించే విధానాలే భవిష్యత్తులో వ్యవసాయాన్ని కాపాడగలవు. అదే సమయంలో రైతులకు ఆర్థికపరంగా కూడా ప్రభుత్వం అండగానిలవాలి. పంట రుణాల చెల్లింపుకు గడువు పొడిగించడం, అవసరమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించడం, పంట బీమా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించడం వంటి చర్యలు రైతుల్లో విశ్వాసాన్ని పెంచుతాయి. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు తగిన సలహాలు అందించి, పరిస్థితులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలను సూచించాలి. తక్కువ నీటితో పండేపంటల సాగునుప్రోత్సహించడం ద్వారా నష్టాలనుకొంతవరకు తగ్గించవచ్చు.నీటి వనరుల సమగ్ర నిర్వహణ, వర్షపునీటి సంరక్షణ, భూసార పరిరక్షణ, వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. నీటి వనరుల సంరక్షణ,రైతులకు తక్షణ ఆర్థికసహాయం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, దీర్ఘకాలిక నీటినిర్వహణ ప్రణాళికలు అమలు చేస్తేనే ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోగలం. రైతును కాపాడటం అంటే దేశభవిష్యత్తును కాపాడటమే. ●

# వెనెజులా విషాదం.. ప్రపంచానికి గుణపాఠం

డివిబి శ్రీహరిన్

ప్రకృతి వైపరీత్యాలు దేశాల రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థలను పరిగణనలోకి తీసుకోవు. కానీ ఒక దేశం ఇప్పటికే సంక్షోభంలో ఉన్నప్పుడు సంభవించే విపత్తు విధ్వంసం అనేక రెట్లు పెరుగుతుంది. ల్యాటిన్ అమెరికా దేశమైన వెనిజువాలాలో తాజాగా సంభవించిన వరుస భారీభూకంపాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయ అస్థిరత, తీవ్ర ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఆంక్షలు, బలహీనమైన మౌలిక వసతులతో ఇప్పటికే అల్లాడుతున్న వెనిజులాను ప్రకృతి మరోసారి మోకాళ్లపై కూర్చోబెట్టింది. వేలాది భవనాలు నేలమట్టమవగా, వందలాది ప్రాణాలు కోల్పోయాయి. గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విదేశీ సహాయక బృందాలు రంగంలోకి దిగినా, శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు సమయంతో పోటీపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఈ విపత్తు కేవలం ప్రకృతి సృష్టించిన విధ్వంసం మాత్రమే కాదు. బలహీనమైన నిర్మాణ వ్యవస్థలు, దీర్ఘకాలిక ఆర్థిక సంక్షోభం, ప్రణాళికా లోపాలు కలిసి ఒక సహజ విపత్తునుమహా మానవీయ విషాదంగా మార్చాయి. అందుకే వెనిజులా విషాదాన్ని కేవలం ఒక భూకంపంగా కాకుండా, ప్రకృతి వ్యవస్థల వైఫల్యం కలగలిసిన సంక్షోభంగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విపత్తు సాధారణ భూకంపం కాదు. భూకంప శాస్త్రంలో 'సీస్మిక్ డబ్లెట్'గా పిలిచే అత్యంత అరుదైన సంఘటన. మొదట సంభవించిన భారీ ప్రకంపనతో బలహీనపడిన భవనాలను, కొద్ది సెకన్ల వ్యవధిలో వచ్చిన రెండో భారీ భూకంపం పూర్తిగా కూల్చివేసింది. సాధారణంగా ప్రధాన భూకంపం తర్వాత వచ్చే ప్రకంపనలు తక్కువ తీవ్రతతో ఉంటాయి. కానీ ఇక్కడ దాదాపు సమాన తీవ్రతతో రెండు భారీ భూకంపాలు సంభవించడం వల్లవిధ్వంసం అనూహ్యంగా పెరిగింది. ఇటువంటి సంఘటనలు ప్రపంచంలో చాలా అరుదుగా మాత్రమే నమోదవుతాయి. వెనిజులా భౌగోళికంగా కరేబియన్ టెక్టోనిక్ ప్లేట్,దక్షిణఅమెరికా టెక్టోనిక్ ప్లేట్‌ల సరిహద్దులో ఉంది. ఈ రెండు ఫలకాలు పరస్పరం రుద్దుకుంటూ కదలడం వల్ల భూమి అంతర్భాగంలో అపారమైన ఒత్తిడి పేరుకుపోతుంది. ఆ ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు భూకంపాలు సంభవిస్తాయి. వెనిజులా గుండా విస్తరించిన బొకొనో ఫాల్ట్ వ్యవస్థ ఈ ప్రాంతంలోని ప్రధాన భూకంపాలకు కారణమవుతోంది. ఈసారి భూకంపాలు తక్కువ లోతులో సంభవించడం వల్ల ప్రకంపనల శక్తి నేరుగా ఉపరితలానికి చేరి విధ్వంసాన్ని మరింత పెంచింది. ఈ విపత్తులో శాస్త్రవేత్తలు మరో కీలక అంశాన్ని గుర్తించారు. దానినే 'రెజోనెన్స్' అంటారు. ప్రతి భవనానికీ ఒక సహజ కంపన వేగం ఉంటుంది. భూకంప తరంగాల కంపన వేగం అదే స్థాయిలో ఉన్నప్పుడు భవనం ఊగిసలాట ఒక్కసారిగా పెరిగి నిర్మాణం క్షణాల్లో కూలిపోతుంది. వెనిజులాలోని అనేక పాత భవనాలు భూకంప నిరోధక ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించబడకపోవడంతో ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపించింది. మొదటి ప్రకంపనతో పగుళ్లు ఏర్పడిన నిర్మాణాలు, రెండో ప్రకంపనను



తట్టుకోలేక శిథిలాలుగా మారాయి. వెనిజులాకుభూకంపాలు కొత్తవి కావు. 1812లో సంభవించిన భారీ భూకంపం వేలాది మందిని బలితీసుకోగా, 1967లో కారకాస్‌ను వణికించిన మరో భూకంపం కూడా భారీ ప్రాణనష్టం కలిగించింది.అయినప్పటికీ గత కొన్నిదశాబ్దాలుగా ఆర్థిక సంక్షోభం కారణంగా భూకంప నిరోధక నిర్మాణ ప్రమాణాల అమలు, పాత భవనాల బలోపేతం, విపత్తు నిర్వహణ వ్యవస్థల ఆధునికీకరణ వంటి చర్యలు ఆశించిన స్థాయిలో జరగలేదు. భౌగోళికంగా అత్యంత ప్రమాద ప్రాంతంలో ఉన్నప్పటికీ, భూకంప ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక పట్టణ ప్రణాళికలను అమలు చేయడంలో వెనిజులా విఫలమైంది. ఈ నిర్లక్ష్యమే తాజా విపత్తులో మరింత భారీ మూల్యం చెల్లించుకునేలా చేసింది. భూకంపం సంభవించిన సమయంలోనే వెనిజులా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం,విదేశీ మారక నిల్వల కొరత, ఆరోగ్య రంగంలో పెట్టుబడుల లోపం కారణంగా అత్యవసర సేవలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ప్రభుత్వ ఆదాయానికి ప్రధాన ఆధారమైన చమురు రంగం గత కొన్నేళ్లుగా క్షీణించడంతో విపత్తు నిర్వహణకు అవసరమైన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. భారీ యంత్రాలు,రక్షణ పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది కొరత కారణంగా మొదటి 72 గంటల్లో సహాయక చర్యలు ఆశించిన వేగంతో సాగలేకపోయాయి. దీంతో స్థానిక ప్రజలే తమ చేతులతో శిథిలాలను తొలగిస్తూ బాధితులను కాపాడేందుకు ప్రయత్నించిన హృదయవిదారక దృశ్యాలు ప్రపంచాన్ని కదిలించాయి. వెనిజులాపై అమల్లో ఉన్న అంతర్జాతీయ ఆంక్షలు, రాజకీయ విభేదాలు సహాయక చర్యలపై పరోక్ష ప్రభావంచూపే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.అయితే ప్రకృతి విపత్తులు రాజకీయ పక్షపాతాన్ని గుర్తించవు. అలాంటి సమయంలో మానవత్వానికే మొదటి ప్రాధాన్యం దక్కాలి. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ రెడ్‌క్రాస్, విదేశీ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే సహాయక చర్యలు ప్రారంభించాయి. కానీ విపత్తు తీవ్రతను దృష్టిలో ఉంచుకుంటే మరింత సమన్వయంతో కూడిన అంతర్జాతీయ సహకారం అత్యవసరం. వెనిజులా విషాదం ప్రకృతి విపత్తులు ఎంత వినాశకరంమాత్రమే కాదు, బలహీనమైన పరిపాలన, నాసిరకం మౌలిక వసతులు, దీర్ఘకాలిక ఆర్థిక సంక్షోభం వాటి ప్రభావాన్ని ఎంతగానో పెంచుతాయని కూడా గుర్తు చేస్తోంది. శాస్త్రీయ ప్రణాళిక, పటిష్ఠమైన నిర్మాణ ప్రమాణాలు, సమర్థవంతమైన విపత్తు నిర్వహణ, అంతర్జాతీయ సహకారం కలిసొస్తేనే ఇటువంటి విపత్తుల నుంచి ప్రాణనష్టాన్ని,ఆస్తినష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రకృతి విపత్తులు ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తాయో మనిషి చెప్పలేడు. కానీ అవి మానవీయ విషాదాలుగా మారకుండా నిరోధించడం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటుంది. వెనిజులా ఇప్పుడు కేవలం శిథిలాలను తొలగించే దశలో లేదు,తన ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను, ముఖ్యంగా ప్రజల విశ్వాసాన్ని తిరిగి నిర్మించుకోవాల్సిన చారిత్రక మలుపు వద్ద నిలిచింది. ప్రకృతి హెచ్చరికలను నిర్లక్ష్యం చేసినా మూల్యం ఎప్పుడూ ప్రాణాలతోనే చెల్లించాల్సి వస్తుంది. వెనిజులా విషాదం ప్రపంచానికి చెబుతున్న అతిపెద్ద పాఠం ఇదే. ●

# భారత్-సీషెల్స్ మధ్య 19 ఒప్పందాలు



### సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో ప్రధాని మోడీ విస్తృత చర్చలు

### వాతావరణం, గ్రీన్ హైడ్రోజన్, ఇంధనం, బ్లూ ఎకానమీ రంగాల్లో పరస్పర సహకారం

### ముగిసిన ప్రధాని మూడ్రోజుల పర్యటన

**విక్టోరియా, జూన్ 29:** ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, సురక్షితమైన, సుసంపన్నమైన హిందూ మహాసముద్ర ప్రాంతం కోసం ఉమ్మడి దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంపై అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో విస్తృత చర్చలు జరిపిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం తన మూడు రోజుల సీషెల్స్ పర్యటనను ముగించారు. ఈ పర్యటన సందర్భంగా, రక్షణ, సముద్ర భద్రత, డిజిటల్ చెల్లింపులు, అంతరిక్షం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య వంటి రంగాలలో భారత్– సీషెల్స్‌లు 19 ఒప్పందాలు కుదిరాయి. వీటిలో సీషెల్స్‌లో యుపిఐ అమలుకు సంబంధించిన ఒప్పందం, జన ఔషధిపై ఒప్పందం వంటివి ఉన్నాయి. ఇదే విషయాన్ని ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. యుపిఐ, ఆరోగ్యం, వ్యవసాయం, షిప్పింగ్, అంతరిక్ష రంగం సహా 19 ఒప్పందాలపై భారత్– సీషెల్స్ సంతకాలు చేశాయని ప్రధాని మోడీ తెలిపారు. వాతావరణం, గ్రీన్ హైడ్రోజన్, ఇంధనం, బ్లూ ఎకానమీ వంటి వినూత్న రంగాలలో భారత్, సీషెల్స్ పరస్పర సహకారాన్ని కొనసాగిస్తాయని తెలిపారు. సీషెల్స్ అభివృద్ధి ప్రాధాన్యతలకు మద్దతు ఇవ్వడానికి, ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత, శాశ్వత భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

**సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్‌తో మోడీ భేటీ:** ఆదివారం మాహేలోని స్టేట్ హౌస్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాధినేతలు పలు అంశాలపై చర్చలు జరిపారు. భారతదేశం ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద ప్రాజెక్టులు, కార్యక్రమాల అమలులో సాధించిన పురోగతి పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్, సీషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50యేళ్లు పూర్తైన సందర్భంగా ఒక ఉమ్మడి స్మారక చిహ్నాన్ని కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా సీషెల్స్ ప్రభుత్వానికి ఒక ఫాస్ట్ పెట్రోల్ వెసెల్‌ను ప్రధాని మోడీ బహుమతిగా ఇచ్చారు. అదనంగా సీషెల్స్ రక్షణ దళానికి 10యుటిలిటీ వాహనాలు, 5 సెట్ల లేజర్ రేడియల్ క్లాస్ పడవలు, 6అంబులెన్సులు, 500మెట్రిక్ టన్నుల బియ్యం, 8,500 మెట్రిక్ టన్నుల సిమెంట్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు.

మోడీ సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు గౌరవ అతిథిగా హాజరయ్యారు, అక్కడి జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించారు. అధ్యక్షుడు హెర్మిని చేతుల మీదుగా 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హురైజన్జ్ పురస్కారాన్ని అందుకున్నారు. మోడీకి విమానాశ్రయంలో సెయిషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్ళై, ప్రవాస భారతీయులు వీడ్కోలు పలికారు. సీషెల్స్ నుంచి బయలుదేరిన అనంతరం, ప్రధాని మోడీ 'ఎక్స్'లో "భారత్‌సెయిషెల్స్ స్నేహాన్ని పెంపొందించే గణనీయమైన ఫలితాలతో నా సీషెల్స్ పర్యటన ముగిసింది" అని పేర్కొన్నారు. గత 50 యేళ్ల భారత్– సీషెల్స్ సంబంధాలు ప్రగాఢ విశ్వాసం, ఉమ్మడి పురోగతితో ముడిపడి ఉన్నాయని, "రాబోయే యాభై ఏళ్ల ఆవిష్కరణలు, సుస్థిరత, ఉమ్మడి శ్రేయస్సుతో రూపుదిద్దుకుంటాయి" అని వివరించారు. "సీషెల్స్ 50 యేళ్ల స్వాతంత్ర్యాన్ని జరుపుకుంటున్న తరుణంలో జాతీయ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది" అని పోస్ట్ చేశారు. ఆ ద్వీపసమూహ దేశ జాతీయ అసెంబ్లీలో తన ప్రసంగంలో, వాతావరణ మార్పుపై నిష్పక్షపాతం, బాధ్యత, సమానత్వంతో కూడిన ప్రపంచ చర్యలకు మోడీ పిలుపునిచ్చారు.



## అఫ్ఘాన్ సరిహద్దుల్లో పాక్ భీకర దాడులు

### 35 మంది మృతి, పలువురికి తీవ్రగాయాలు

**కాబూల్,జూన్ 29:** అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్తాన్, సొంత సరిహద్దుల్లో మాత్రం భీకర దాడులకు పాల్పడుతోంది. అఫ్గనిస్తాన్ సరిహద్దుల్లో పాక్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్తాన్ వాదిస్తుండగా, అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గనిస్తాన్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో పాక్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది. సైనిక పరిభాషలో డబుల్ ట్యాప్ అంటే ఒకే ప్రదేశంపై కొద్ది వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. ఇది అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే, మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు పాక్ వైమానిక దళం జెట్లు అఫ్గనిస్తాన్‌లోని పక్తికా, ఖోస్త్, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు, శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా, పాక్ జెట్లు మళ్లీ విరుచుకుపడి వారిపైనే రెండోసారి బాంబుల వర్షం కురిపించాయి. ఈ రెండో దాడి కారణంగానే మృతుల సంఖ్య అనూహ్యంగా పెరిగి, వందకు పైగా క్షతగాత్రులతో ఆసుపత్రులు నిండిపోయాయి. గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్టు పాకిస్తాన్ ప్రకటించింది. తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) నుంచి విడిపోయిన జమాత్‌ఉల్‌అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఇందులో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాక్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తరార్ తెలిపారు. పాకిస్తాన్ వాదనను అఫ్గనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాక్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికి పైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు.



## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మళ్లీ ఖర్గే

### కొత్తగా ఎన్నికైన 8 మంది ఎంపిలు ప్రమాణస్వీకారం

**న్యూఢిల్లీ, జూన్ 29:** రాజ్యసభ సభ్యుడిగా తిరిగి నియమితులు కావడంతోపాటు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా మళ్లీ గుర్తింపుపొందారు. ఈ నేపథ్యంలో, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా సేవలందించేందుకు తన అంకితభావాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం పునరుద్ఘాటించారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ చైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి మోడీ బులెటిన్ విడుదల చేశారు. అంతకు ముందు రాజ్యసభ చైర్మన్ ఛాంబర్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ చేత ఖర్గే ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బిజెపి నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపిలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు. నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజా రియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం.నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపుర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సింగ్ నారాయణన్, రాజ్యసభ నేత జెపినడ్డా, పార్లమెంటరీ వ్యవహారాలశాఖమంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ పాల్గొన్నారు.

## సీషెల్స్ జాతీయ వేడుకల్లో భారత్ సైన్యం కవాతు

### గౌరవ అతిథిగా ప్రధాని మోడీ హాజరు

### భారత యుద్ధ నౌకలు తర్కాష్, ఇక్షక్.. పోర్ట్ విక్టోరియాలో లంగరు

### మహాసాగర్ దార్శనికతకు భారతదేశ నిబద్ధతకు నిదర్శనమిది: ప్రధాని



**విక్టోరియా, జూన్ 29:** భారత్ – సీషెల్స్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న రక్షణ భాగస్వామ్యానికి నిదర్శనంగా, భారత సైన్యానికి చెందిన అసోం రెజిమెంట్, భారత నౌకాదళం, భారత నౌకాదళ మార్చింగ్ బ్యాండ్‌కు చెందిన సిబ్బందితో కూడిన భారత దళం సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో పాల్గొంది. సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ ద్వీపసమూహ ద్వీపంలో తన అధికారిక పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, "సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో అసోం రెజిమెంట్, భారత నౌకాదళానికి చెందిన దళాలు పాల్గొన్నాయి. ఇది భారతదేశం–సీషెల్స్ మధ్య శాశ్వత స్నేహానికి మరో నిదర్శనం" అని అన్నారు. మార్చింగ్ దళాలు ఉత్సవ వేదికను దాటి వెళుతున్నప్పుడు ప్రధానమంత్రి గౌరవ సూచకంగా నిలబడ్డారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, వేడుకల్లో భాగంగా సంప్రదాయానికి అనుగుణంగా, భారత నౌకాదళ నౌకలు తర్కాష్, ఇక్షక్ జూన్ 26న పోర్ట్ విక్టోరియాలో లంగరు వేశాయి. భారత నౌకాదళానికి చెందిన ఒక ప్రధాన యుద్ధనౌక అయిన ఐఎన్‌ఎస్ తర్కాష్, ప్రస్తుతం నైరుతి హిందూ మహాసముద్రంలో కొనసాగుతున్న కార్యాచరణ మోహరింపులో ఉంది. ఇదిలా ఉండగా, ఐఎన్‌ఎస్ ఇక్షక్ భారత నౌకాదళం స్వదేశీంగా రూపొందించి, నిర్మించిన సర్వే నౌక. ఈ నౌక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సీషెల్స్ రక్షణ దళాలతో కూడా కలిసి పనిచేస్తుంది. "మహాసాగర్ దార్శనికతకు అనుగుణంగా సముద్ర సహకారం, ప్రాంతీయ భద్రత పట్ల భారతదేశ నిబద్ధతను ఈ మోహరింపు పునరుద్ఘాటిస్తుంది" అని భారత నౌకాదళం ఒక ప్రకటనలో తెలిపింది.

సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలు గత యాభై ఏళ్లుగా సీషెల్స్ ప్రజల అద్భుతమైన ప్రయాణాన్ని గౌరవిస్తాయని, అలాగే ఆ తూర్పు ఆఫ్రికా దేశం అభివృద్ధి ప్రయాణానికి మద్దతు ఇవ్వడంలో భారతదేశ నిబద్ధతను ప్రధాన మంత్రి మోడీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గూలాం కూడా హాజరయ్యారు.



## భారత్ ఆర్మీకి కొత్త టాప్ ఆఫీసర్లు..

**న్యూఢిల్లీ,జూన్ 29:** భారత్ ఆర్మీకి కొత్తగా టాప్ ఆఫీసర్లు రానున్నారు. భారత ఆర్మీ చీఫ్‌గా మంగళ వారం లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక బుధవారం భారత వైమానిక దళ వైస్‌చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. భారతీయ రక్షణ వ్యవస్థలో ఇటీవలే కొత్తవారు ఉన్నత పదవులను అలంకరించిన విషయం తెలిసిందే. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, నేవీ చీఫ్‌గా అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆర్మీ వైస్ చీఫ్‌గా ఉన్న జనరల్ సేథ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకుంటారు. ధీరజ్ సేథ్ ఆర్మర్డ్ కార్ప్స్ చెందిన వ్యక్తి. ఆయన 1986లో ఆర్మీలో కమిషన్ అయ్యారు. మూడు దశాబ్దాల తర్వాత ఆర్మర్డ్ కార్ప్స్‌కు చెందిన ఆఫీసర్ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. 1997లో చివరిసారి ఆర్మర్డ్ కార్ప్స్‌కు చెందిన జనరల్ రాయ్ చౌదరి ఆర్మీ చీఫ్‌గా చేశారు. లెఫ్టినెంట్ జనరల్ సేథ్‌కు ఆపరేషనల్, స్ట్రాటజిక్, క్యాపబులిటీ డెవలప్మెంట్, ఇన్‌స్టిట్యూషనల్ డొమెయిన్స్‌లో విస్తృతమైన అనుభవం ఉన్నది. జూలై ఒకటో తేదీన ఎయిఫ్ వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం ఐఏఎఫ్ చీఫ్‌గా ఉన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో సమానంగా ఉన్న సీనియర్ అధికారి ఆయన. ఈ ఏడాది అక్టోబర్‌తో ఆయన పదవీకాలం పూర్తి కానున్నది. ప్రస్తుతం చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా దీక్షిత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సీడీఎస్ నేతృత్వంలో త్రివిధ దళాలకు చెందిన సిబ్బంది పనిచేస్తుంది. ఆయన ఫైటర్ పైలట్ కూడా. బెంగుళూరులోని ఫ్లయిట్ టెస్ట్ స్క్వాడ్రన్‌లో కమాండింగ్ ఆఫీసర్‌గా చేశారు. ఆర్మీ చీఫ్‌గా సేథ్ రావడంతో వైస్ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ ఆ బాధ్యతలను స్వీకరిస్తారు.

## ఆరునెలల్లోనే తమిళనాడుకు మళ్లీ ఎన్నికలు

### మాజీ సిఎం డిఎంకె అధినేత స్టాలిన్ జోస్యం



**చెన్నై,జూన్ 29:** తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధిమందగించిందన్నారు. పెట్టుబడి దారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అన్నారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బం దులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచా రంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమా వేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

## యుద్ధంలో మొత్తం వ్యయం 40 బిలియన్ డాలర్లు

### అమెరికా స్థావరాలకే 5.1బిలియన్ డాలర్ల నష్టం

**వాషింగ్టన్,జూన్ 29:** ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల వల్ల పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలకు అధికారికంగా వెల్లడించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం జరిగిందని ఓ నివేదిక వెల్లడించింది. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌అంచనా ప్రకారం ఈ యుద్ధం వల్ల మొత్తం వ్యయం సుమారు 40 బిలియన్ డాలర్లకు చేరగా, అందులో 2.2 నుంచి 5.1 బిలియన్ డాలర్ల వరకు అమెరికా సైనిక స్థావరాలకే నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. దీంతో ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాల భద్రత, భవిష్యత్తుపై పెంటగాన్ పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి చివరి నుంచి జూన్ మధ్య జరిగిన ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలో కనీసం 20 అమెరికా సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా బహ్రెయిన్‌లో ఉన్న అమెరికా నౌకాదళ ప్రధాన స్థావరం'నేవల్ సపోర్ట్ యాక్టివిటీ'కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ దాడుల్లో కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌తో పాటు డజనుకు పైగా భవనాలు, రెండు శాటిలైట్ కమ్యూనికేషన్ టెర్మినల్స్ దెబ్బతిన్నట్లు నివేదిక పేర్కొంది. దాడుల సమయంలో ఎక్కువ మంది సిబ్బందిని ముందుగానే తరలించినందున ప్రాణనష్టం జరగలేదని అమెరికా సైన్యం తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో బహ్రెయిన్‌లోని స్థావరాన్ని పునర్వ్యవస్థీకరించడం, కువైట్, సౌదీ అరేబియాల్లో ఉనికిని తగ్గించడం, ఇరాన్ క్షిపణుల పరిధికి దూరంగా కొన్ని సైనికకార్యకలాపాలను పశ్చిమ ప్రాంతాలకు తరలించే అంశాలను పెంటగాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే భూగర్భకమాండ్ కేంద్రాల ఏర్పాటుపైనా చర్చ జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. నష్టపోయిన భవనాల పునర్నిర్మాణానికే సుమారు 400మిలియన్ డాలర్లు భారత కరెన్సీలో దాదాపు రూ.3,400కోట్లు ఖర్చవుతుందని అంచనా.అయితే శిథిలాల తొలగింపు,అదనపు భద్రతా ఏర్పాట్ల ఖర్చు ఇందులో లేదని పేర్కొంది.

## నిందితుల తరపున వాదిస్తే రూ.5 లక్షల జరిమానా

### అయోధ్య బార్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం



**అయోధ్య,జూన్ 29:** అయోధ్య రామాలయంలో విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సోమవారం అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. నిందితుల తరపున కేసును వాదించబోమని లాయర్ల సంఘం తీర్మానించింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాలికా ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. నిధుల చోరీ కేసులో నిందితులను తరపున ఎవరూ వాదించరు అని, ఒకవేళ వాదిస్తే వారికి 5 లక్షల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ మరో నిర్ణయాన్ని కూడా తీసుకున్నది. రామాలయ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావు.. తక్షణమే అయోధ్య విడిచి వెళ్లాలని డిమాండ్ చేసింది. మూడు రోజుల్లోగా అయోధ్య నుంచి వెళ్లిపోకుంటే, అప్పుడు సిటీని బ్లాక్ చేస్తామని, ఎవర్నీ లోపలికి రానివ్వకుండా చేస్తామని మిశ్రా తెలిపారు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరి పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఈ కేసులోని 8 మంది నిందితుల్లో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరు ణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ ఉన్నారు. నిందితులు అందరూ క్యాష్ కౌంటింగ్, విలువైన వస్తువులను భద్రత పరిచే ఉద్యోగంలో ఉన్నారు. ఈ కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లనున్నట్లు ప్రసాద్ మిశ్రా తెలిపారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ప్రస్తుతం ట్రస్టుకు రాజీనామా చేశారు. దానిపై జూలై 7వ తేదీన నిర్ణయించనున్నారు.

# సంక్షిప్త వార్తలు

## అయోధ్యకేసు అత్యవసర విచారణకు సుప్రీం నో..



**న్యూఢిల్లీ,జూన్ 29:** అయోధ్య రామమందిర విరాళాల చోరీపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వేసవి సెలవులు ముగిసిన వెంటనే ఈ పిటిషన్‌ను విచారణకు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ అంశంలో అంత అత్యవసరం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. జస్టిస్ ఎం.ఎం. సుంద్రేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం ముందు ఈ పిటిషన్ ప్రస్తావనకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఆరోపణలు చాలా తీవ్రమైనవని వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ ధర్మాసనం తక్షణ విచారణకు అంగీకరించలేదు. న్యాయవాది నరేంద్ర కుమార్ గోస్వామి వ్యక్తిగత హోదాలో ఈ పిటిషన్ దాఖలు చేశారు.

## అన్నా డిఎంకే ఆరో ఎమ్మెల్యే రాజీనామా



**చెన్నై,జూన్ 29:** తమిళనాడులోని అన్నాడీఎంకేకు మరో షాక్ ఎదురైంది. ఆరో ఎమ్మెల్యే ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. మాజీ రవాణా శాఖ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ తాజాగా తన శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు.కరూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన ఆయన సోమవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించారు. అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన విజయభాస్కర్, అధికార టీవీకేలో చేరవచ్చని తెలుస్తున్నది.

## లెఫ్టినెంట్ గవర్నర్ ప్రథమపూజతో అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం



**శ్రీనగర్,జూన్ 29:** ప్రతిష్ఠాత్మక శ్రీఅమర్‌నాథ్‌యాత్ర లాంఛనంగా ప్రారంభమైంది. సోమవారం పవిత్ర గుహాలయంలో ప్రథమ పూజను శాస్త్రోక్తంగా నిర్వ హించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొని, యాత్ర సన్నాహా లకు అధికారికంగా శ్రీకా రంచుట్టారు. ఈ సందర్భంగా ఆయన మంచులింగానికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమం అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఎక్స్‌వేదికగా తన హర్షం ప్రకటిం చారు. హర హర మహాదేవ్ శ్రీ అమర్‌నాథ్ జీ పవిత్ర గుహలో ప్రథమపూజ నిర్వహించడం నిజంగా నా అదృష్టం. ఇది వార్షిక యాత్రకు లాంఛనమైన ప్రారంభం. బాబా బర్ఫానీ ఆశీస్సు లతో ప్రజలందరూ శాంతి, శ్రేయస్సు, సంపూర్ణ ఆరోగ్యాలతో వర్థిల్లాలని ప్రార్థించానని పేర్కొన్నారు.

## ఖొమేనీ అంత్యక్రియలకు భారత్ ప్రతినిధులు వీరే..



**న్యూఢిల్లీ,జూన్ 29:** అమెరికా, ఇజ్రాయెల్‌దాడుల్లో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూలై 5 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు ఈ అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. భారత్ తరఫున కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరిటా, బీహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇరాన్ వర్గాలు పేర్కొనగా దీనిపై ఇంతవరకు భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ సహా 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతిచెందారు.

## నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి ముగ్గురు మృతి

**జైపూర్,జూన్ 29:** జైపూర్‌లోని చంద్వాజీలో నిర్మాణంలో ఉన్న గోడ కూలిపోవడంతో కనీసం ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉన్నారు. కాగా కూలీలతో సహా 12 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో చేర్చారు. సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యాయి. చంద్వాజీ ప్రాంతంలోని తాలా మోడ్ సమీపంలో ఉన్న ఆరావళి ప్యాలెస్ వద్ద నిర్మాణ పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సోమవారం నిర్మాణంలో ఉన్న గోడ కూలిపోయినప్పుడు పలువురు కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

## మూడేళ్ల చిన్నారి హత్యాచార దోషికి మరణశిక్ష



**ముంబై,జూన్ 29:** మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన 65 ఏళ్ల వృద్ధుడికి కోర్టు మరణశిక్ష విధించింది. ఈ నేరం అత్యంత క్రూరమైనదని అందుకే అత్యంత అరుదైన తీర్పు ఇచ్చినట్లు న్యాయమూర్తి వెల్లడించారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 1న నస్రాపూర్ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. 65 ఏళ్ల భీమ్‌రావ్ కాంబ్లే తినుబండారాల ఆశ చూపించి ఆ చిన్నారిని తీసుకెళ్లడం సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించింది. పసి దూడను చూపిస్తానని చెప్పిన వృద్ధుడు ఆ బాలికను పశువుల పాక సమీపంలోని షెడ్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ బాలిక నోరు మూసి, ఛాతిపై గాయం చేసి ఆమెను హత్య చేశాడు. చిన్నారి కోసం వెతకగా మృతదేహం అక్కడ లభించింది. మరోవైపు సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల సహాయంతో నిందితుడు భీమ్‌రావ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారిపై హత్యాచారం కేసు దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులు పగలతో పాటు రాత్రులు కూడా పని చేశారు. 15 రోజుల్లో కీలక ఆధారాలు సేకరించారు. 55 మంది సాక్షుల వాంగ్మూలాలు రికార్డ్ చేశారు. 1,200 పేజీల వివరణాత్మక ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. పూణే జిల్లా, సెషన్స్ కోర్టులో ఈ కేసుపై రోజువారీ విచారణ జరిగింది. మూడేళ్ల బాలిక కిడ్నాప్, లైంగిక వేధింపులు, అత్యాచారం, హత్య ఆరోపణల్లో నిందితుడు భీమ్‌రావ్ కాంబ్లేను దోషిగా కోర్టు నిర్ధారించింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించాలన్న నిందితుడి తరఫు న్యాయవాది అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ఎలాంటి దయ లేదా ఉదారత చూపాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. మరోవైపు సుప్రీంకోర్టు నిర్వచించిన అరుదైన వాటిలోకెల్లా అరుదైన వర్గంలోకి ఈ నేరం వస్తుందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు.

## హతుడు కేతన్‌నుంచి రూ.కోటి తీసుకున్న సియా

### ఆ సొమ్మును ప్రియుడికి ఇచ్చినట్లు అంగీకారం



**పూణె,జూన్ 29:** పుణె రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. పెళ్లిషాపింగ్ పేరుతో వరుడి నుంచి రూ.కోటి తీసుకున్న నిందితు రాలు సియా గోయల్ ఆ సొమ్మును తన ప్రియుడు చేతన్ చౌదరికి ఇచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. హత్య తర్వాత ఇద్దరూ మూడేళ్లకు పెళ్లి చేసుకోవాలని కూడా ముందుగానే ప్లాన్ చేసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. చేతన్ వ్యాపారం, కెరీర్‌ను నిలబెట్టేందుకు ఆ డబ్బును ఉపయోగించాలని ఇద్దరూ నిర్ణయించుకున్నట్లు సమాచారం. తాను ఆర్థికంగా బలపడేందుకు కనీసం మూడేళ్లు పడుతుందని సియాకు చేతన్ చెప్పినట్లు పోలీసులు గుర్తించారు. అందుకే కేతన్ హత్య తర్వాత సియా మూడేళ్లపాటు పెళ్లి చేసుకోకుండా ఉండాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారం అంతా సద్దుమణిగిన తర్వాతే వివాహం చేసుకోవాలని ముందుగానే ప్రణాళిక వేసుకున్నట్లు దర్యాప్తులో తేలింది.

## ఆర్టీసీ బస్సు ప్రమాదఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రవిచారం

### గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశం

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** వనపర్తి సమీపంలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రవిచారం వ్యక్తం చేశారు. వనపర్తి డిపోకు చెందిన టిజి 32 జడ్ 0015 ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం ఉదయం కర్నూలు నుండి వనపర్తికి వెళ్తుండగా రంగాపూర్ సమీపంలో జాతీయ రహదారి 44పై ప్రమాదానికి గురైన ఘటన పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులందరికీ మెరుగైన వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం లో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిసిందని, వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు.

ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ అధికారులు, పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది వేగంగా స్పందించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. ప్రమాద ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ నిర్వహించి, పూర్తి నివేదిక సమర్పించాలని ఆర్టీసీ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. గాయపడిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షి ంచారు.


వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో సోమవారం ఉదయం బోల్తా పడిన బస్సు

## పెబ్బేరులో ఆర్టీసీ బస్సు బోల్తా

### ఒకరి మృతి, పలువురికి తీవ్రగాయాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** మంత్రాలయం నుంచి వనపర్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు జాతీయ రహదారి 44పై పెబ్బేరు సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో సోమవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్ పైకెక్కి బోల్తా కొట్టింది. ఆ సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పెబ్బేర్ ఎస్సై వెంకటేష్ గౌడ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో వనపర్తి పెబ్బేరు ప్రభుత్వ దవాఖానాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని కర్నూలు దవాఖానకు తరలించారు. అదే సమయంలో హైదరాబాద్ వెళ్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వెంటనే బస్సు వద్దకు చేరుకొని క్షతగాత్రులకు తక్షణ సాయం అందించి దవాఖాన కు తరలించారు. బస్సు వేగం తక్కువగా ఉండడంతో ప్రమాద తీవ్రత తగ్గి ఎలాంటి ప్రాణాపాయం ఏర్పడలేదు.

## ఇహెచ్‌ఎస్‌కి ప్రభుత్వోద్యోగులు మూలవేతనంలో 1.5 శాతం చెల్లించాలి

### పెన్షనర్లు పెన్షన్‌లో 1.5 శాతం ఇవ్వాలి

### తప్పనిసరిగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, పెన్షనర్లకు నూతనంగా అమలు చేయనున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కి సంబంధించి ఉద్యోగులు, పెన్షనర్ల మూలవేతనం నుంచి 1.5శాతం చెల్లించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ తమ మూల వేతనం, మూల పింఛనులో 1.5 శాతం ఉద్యోగుల ఆరోగ్య పథకానికి చెల్లించడాన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 79ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు సోమవారం జారీ చేశారు. నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు ఉద్యోగుల మూలవేతనంలో 1.5 శాతం చొప్పున మినహాయించడానికి సంబంధించిన మార్గదర్శకాలను ఇందులో పేర్కొన్నారు.

అందులో భాగంగా భార్య భర్తలలో.. ఇద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినప్పుడు, ఒకరు రాష్ట్ర ప్రభుత్వ మరొకరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినప్పుడు, ఇద్దరిలో ఒకరు పెన్షనర్, ఇంకొకరు ఉద్యోగిగా ఉన్నప్పుడు ...ఒక్కరికే ఈహెచ్‌ఎస్ కోసం మినహాయించాలని పేర్కొనడం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినప్పుడు.ఒకరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి, మరొకరు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అయినప్పుడు. ఒక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ సర్వీస్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్ రెండింటినీ పొందుతున్నప్పుడు.

పై సందర్భాల్లో సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీవో) ఆధార పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారించాలి. అలాగే ఐఎఫ్‌ఎంఐఎస్–హెచ్‌ఆర్‌ఎంఎస్ వ్యవస్థలో భార్య/భర్త ఉద్యోగం, పెన్షన్ వివరాలను నమోదు చేసి ఈహెచ్‌ఎస్ చందా రెండుసార్లు మినహాయించకుండా చూడాలి. ఇప్పటికే అదనంగా మినహాయించి ఉంటే, ఆ అదనపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఉత్తర్వులో స్పష్టం చేశారు.

## ఫ్రాన్స్‌తో పర్యాటక, సాంస్కృతిక బంధాల బలోపేతానికి కృషి

### తెలంగాణ పర్యాటక రంగాన్ని ఫ్రెంచ్ పర్యాటకులకు చేరువ చేద్దాం

### సాంస్కృతిక మార్పిడి ద్వారానే పర్యాటకం, పెట్టుబడులకు ఊతం

### మంత్రి జూపల్లిని కలిసిన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్

### పర్యాటక, వారసత్వ రంగాల్లో సంయుక్త కార్యాచరణకు ప్రతిపాదన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పెట్టుబడులు, ప్రజల మధ్య పరస్పర సంబంధాల బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉందని, హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదుగుతూనే తన సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షి ంచుకుంటోందని అన్నారు. తెలంగాణ పర్యాటక విశేషాలను ఫ్రాన్స్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం, ఫ్రెంచ్ ఎంబసీ, పర్యాటక సంస్థలు భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, పరస్పర పర్యటనలను మరింత విస్తరించాలని సూచించారు. తెలంగాణ ఫ్రాన్స్ మధ్య ఉన్న సాంస్కృతిక సారూప్యతలు, వారసత్వ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి అవకాశాలను గుర్తించేందుకు సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారానికి బాటలు పడతాయని తెలిపారు. ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ మాట్లాడుతూ పర్యాటకం దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు కీలక రంగమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించే దేశాల్లో ఫ్రాన్స్ ఒకటని, ప్రతి సంవత్సరం 10 కోట్లకు పైగా అంతర్జాతీయ పర్యాటకులు ఫ్రాన్స్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. పర్యాటకం, సంస్కృతి రంగాల అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని చెప్పారు. భారత్–ఫ్రాన్స్ మధ్య రక్షణ, ఔషధ తయారీ, సాంకేతిక రంగాల్లో బలమైన భాగస్వామ్యం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో సుమారు 200 మంది ఫ్రెంచ్ పౌరులు నివసిస్తున్నారని తెలిపారు. తెలంగాణతో పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ రంగాల్లో మరింత సహకారానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ఫ్రెంచ్ పర్యాటకులకు మరింత చేరువ చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.



## పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

### రోజుకు అదనంగా రూ.10 కోట్లు రాక

### ఆర్థిక శాఖ అధికారుల సంతృప్తి

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువలను ఇటీవల పెంచిన నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. అయితే ఇదే సమయంలో రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్యలో మాత్రం స్వల్ప తగ్గుదల కనిపిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం నుంచి అమల్లోకి వచ్చిన మార్కెట్ విలువల సవరణ రాష్ట్ర వసూళ్లను గణనీయంగా పెంచింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్యలో స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ, పెరిగిన మార్కెట్ విలువలు రాబడిలో భారీ పెరుగుదలకు దారితీశాయి. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు ప్రతిరోజూ దాదాపు రూ.10 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతోంది. సవరించిన మార్కెట్ విలువలు రిజిస్ట్రేషన్ల వసూళ్లను గణనీయంగా పెంచాయని పేర్కొంటూ ఆర్థిక శాఖ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు, ఇతర ప్రధాన నగరాలు, పట్టణాల చుట్టూ వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలలో ఖాళీ స్థలాలు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్‌ల రిజిస్ట్రేషన్ విలువలు పెరగడమే ఆదాయంలో ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు. సవరించిన మార్కెట్ విలువలు అమల్లోకి రాకముందే ఆస్తి యజమానులు లావాదేవీలను నమోదు చేసుకోవడానికి ఎగబడటంతో, మే నెలలో ముందస్తు రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.1,700 కోట్లు సమకూరాయి. ధరల సవరణ తర్వాత రిజిస్ట్రేషన్లు నెమ్మదిస్తాయని అంచనాలు ఉన్నప్పటికీ, ఈ నెల మొత్తం ఈ ధోరణి బలంగా కొనసాగింది. ఈ నెల 25 వరకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ రూ.1,023.42 కోట్లు వసూలు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.920 కోట్లుగా ఉంది. ఈ నెలలో ఇంకా కొన్ని పనిదినాలు మిగిలి ఉండటంతో, మొత్తం రాబడి రూ. 1,100 కోట్లను సులభంగా దాటుతుందని, ఇది గత ఏడాది జూన్ కంటే దాదాపు రూ. 200 కోట్లు అధికమని అధికారులు అంచనా వేస్తున్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం 1న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూ ములు, భూదాన భూములులో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, పేదల ఇళ్ల స్థలాల కూల్చివేతను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తం గా దశలవారీగా ఆందోళనలు, పోరాటాలు చేయాలని నిర్ణయించడం జరి గిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేన సాంబశివరావు తెలి పారు. అందులో భాగంగా జులై 1న అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యా లయం వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. జులై 6న ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సిగాచి పరిశ్రమ ఘటనలో మరణిం చిన బాధిత కుటుంబాలకు యాజమాన్యం వెంటనే పరిహారం చెల్లిం చాలని డిమాండ్ చేశారు. పాశ మైలారం సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించి 54 మంది మరణించిన ఘటన ఏడాది పూర్తవుతున్నప్పటికీ బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయి పరిహారం అందకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈఎస్ఐ, పీఎఫ్‌లకు అదనంగా కోటి రూపాయలు, ఘటనలో గాయపడిన వారికి తగిన పరిహారం, వైద్య ఖర్చులను యాజమాన్యం నుండి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.


సోమాజీగూడలోని ఏషియన్ ఇన్‌స్టిటిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విహెచ్

## ప్రభుత్వ సలహాదారు విహెచ్‌కు శస్త్ర చికిత్స

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావుకు సోమవారం శస్త్రచికిత్స జరిగింది. ఆయ నకు కిడ్నీలో స్టోన్ సమస్య ఉండడంతో సోమాజీగూడలోని ఏషియన్ ఇన్‌స్టిటిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు) ఆస్ప త్రిలో డాక్టర్ మల్లికార్జున్ వైద్యబృందం విహెచ్‌కు శస్త్రచికిత్స నిర్వ హించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య సమస్య నిలకడగా ఉందని వైద్యు లు పేర్కొన్నారు. విహెచ్ అనారోగ్య సమస్య తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఆస్పత్రికి రావడంతో సందడి నెలకొంది. కాగా, ఈనెల 25వ తేదీన సాయంత్రం విహెచ్‌కు కిడ్నీకి సంబంధించిన తీవ్ర అనారోగ్య సమస్య రావడంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే.

## బియ్యం ఎగుమతులకు ప్రత్యేక విధానం

### ఫోర్టిఫైడ్ రైస్‌తో పోషకాహార భద్రతకు ఊతం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు సంస్థ ప్రతినిధులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బియ్యం పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక బియ్యం ఎగుమతి విధానాన్ని రాష్ట్ర ప్రభు త్వం రూపొందిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుండగా, కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులే రాష్ట్రంలో వినియోగం అవుతున్నా యన్నారు. మిగిలిన బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఎగుమతి విధానాన్ని తీసుకురావడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన అన్‌లాకింగ్ మార్కెట్ పొటెన్షియల్– అడ్వాన్సింగ్ ఫోర్టిఫైడ్ రైస్ ఇన్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా కేసిపి న్యూట్రి పోషణ ఫోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తులను ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రస్తుతం దేశంలోనే బియ్యం ఉత్పత్తి, సేకరణలో అగ్రస్థానంలో ఉందన్నారు. బియ్యం మిల్లర్లు దేశీయ మార్కెట్‌తో పాటు విదేశీ మార్కెట్లలోనూ విస్తరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. పిలిఫిన్స్ వంటి దేశాలకు ఇప్పటికే తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతి అవుతుందన్నారు. ప్రజలు ప్రతి రోజు తీసుకొనే ప్రధాన ఆహారమైన బియ్యం ద్వారానే పోషకాహార లోపాలను తగ్గించవచ్చన్నారు. ఆరోగం మాత్రల్లో కాదని, మన భోజన పాత్రలో ఉండాలన్నారు. టెక్నోసర్వ్ ఆధ్వర్యంలో మిల్లర్స్ ఫర్ న్యూట్రిషన్ సంస్థ, కేసిపి న్యూట్రిషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బియ్యం మిల్లర్లు, ఆహార పరిశ్రమ ప్రతినిదులు, పోషకాహార నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియాకు కత్తెర.. ఎకరానికి 2 బస్తాలే

### మండల యూనిట్‌గా బుకింగ్స్.. అదనపు సెక్యూరిటీ, టైమ్ లాకింగ్ ఫీచర్లు

### ఫెర్టిలైజర్ యాప్‌లో మార్పులు.. ఎరువుల పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన


### వ్యవసాయ శాఖ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువులను అందించేందుకు వ్యవసాయ శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో ఎదురైన ఇబ్బందులు, అక్రమాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ సాగు సమయానికి ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసింది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లో వ్యవసాయ శాఖ కీలక మార్పులు, అప్‌డేట్‌లను తీసుకొచ్చింది. వ్యవసాయ శాఖ అధికారవర్గాల సమాచారం మేరకు గతంలో ఈ యాప్ ద్వారా ఎక్కడి వారైనా, ఏ ప్రాంతంలోనైనా యూరియా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో స్థానిక రైతులకు ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుత సీజన్ నుంచి మండల యూనిట్ విధానాన్ని అమలుల్లోకి తీసుకొచ్చారు. దీనివల్ల రైతులు కేవలం తమ సొంత మండల పరిధిలోనే యూరియా బుకింగ్ చేసుకోవడానికి వీలుంటుంది. ఫలితంగా స్థానిక రైతులకు సకాలంలో ఎరువుల కోటా దక్కనుంది. గతంలో కొందరు ఎరువుల డీలర్లు తమకు తెలిసిన వారికి ముందే సమాచారం అందించి ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు చూపిస్తూ నిల్వలను ఆఫ్‌లైన్ ద్వారా పక్కదారి పట్టించేవారనే ఆరోపణలు వచ్చాయి. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం యాప్‌లో అదనపు సెక్యూరిటీ, టైమ్ లాకింగ్ ఫీచర్లను జోడించింది. ఇకపై డీలర్లు తమ వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసినా, అది రైతులకు మరుసటి రోజు ఉదయం 7 గంటలకే స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే ఉదయం 7 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తే, అది మధ్యాహ్నం 3 గంటలకే రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ నిబంధన వల్ల ఎరువుల నిల్వలపై పారదర్శకత పెరగనుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు యాప్ ఓపెన్ చేసి తమకు కావలసిన యూరియాను సులభంగా బుక్ చేసుకోవచ్చు. అలాగే గతంలో పలువురు రైతులు, వ్యాపారులు యూరియా కొరత వస్తుందనే భయంతో పంటల నమోదు సమయంలో మొక్కజొన్న పంటను ఎంపిక చేసుకునేవారు. ఎందుకంటే మొక్కజొన్న సాగు చేసే రైతులకు ఎకరాకి 5 బస్తాల యూరియా అందించే వెసులుబాటు ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు అవసరం లేకపోయినా ఎక్కువ బస్తాలను పొంది నిల్వ చేసుకునేవారు. ఈ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ఈసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులు ఏ పంట సాగు చేసినా సరే ఎకరానికి కేవలం 2 బస్తాలు మాత్రమే బుకింగ్ అవుతాయి. ఒక ఎకరం భూమి ఉన్న రైతుకు ఒకే విడతలో గరిష్టంగా రెండు బస్తాలు మాత్రమే బుకింగ్ చేసుకునేలా యాప్‌లో పరిమితి విధించారు. ఇక సాంకేతిక ఇబ్బందులను తొలగించడంలో భాగంగా ఐటీ విభాగాధికారులు ఈ ఫర్టిలైజర్ యాప్‌ను పూర్తిగా అప్‌డేట్ చేశారు. గతంలో యూరియా బుకింగ్ చేసే సమయంలో ప్రతిసారీ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ వచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చేది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఓటీపీలు సకాలంలో రాక రైతులు బుకింగ్ చేసుకోలేకపోయేవారు.

## ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

### ఆగస్టు 29 వరకు దరఖాస్తులకు అవకాశం: టాస్ డైరెక్టర్ లింగయ్య

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) అధ్వర్యంలో టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను టాస్ డైరక్టర్ కె లింగయ్య సోమవారం విడుదల చేశారు. ఓపెన్ స్కూల్స్‌లో టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవాలనుకునే వారు ఆగస్టు 29 వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫీజును ఆగస్టు 28 వరకు చెల్లించాలని సూచించారు. ఫీజును మీ సేవా, టీజీ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన పూర్తి సమచారాన్ని పొందుపర్చినట్టు టాస్ డైరక్టర్ లింగయ్య ప్రకటనలో తెలిపారు.



సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

## ఇంజినీరింగ్ బి-కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలి

### ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ఎఐఎస్ఎఫ్ ధర్నా

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇంజనీరింగ్ బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల ఫీజుల వ్యాపారాన్ని అరికట్టాలని, మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని, డిమాండ్ కోర్సుల సీట్లపై ఫీజుల దందాను అరికట్టాలని, యాజమాన్య కోటా పేరుతో లక్షల రూపాయల ఫీజుల దోపిడీ చేస్తున్న కళాశాలలపై ఎసిబి, ఐటి దాడులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడీ చేస్తున్నాయని, ఇంజినీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారమయంగా మార్చారని విమర్శించారు.

## 4 రోజుల్లోనే 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలు ఇంటింటికి పంపిణీ

### నిర్ణీత గడువులోగా వందశాతం అందజేసేందుకు చర్యలు

### జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి విడియో కాన్ఫరెన్స్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న 'సర్' ప్రక్రియపై సోమవారం బిఆర్‌కె భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం నాలుగు రోజులలోనే దాదాపు 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడంపై బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల అధికారుల పనితీరు పట్ల సిఇఒ అభినందించారు. నిర్ణీత గడువులోగా 100శాతం ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసేందుకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు బిఎల్‌ఓలను ప్రోత్సహించాలని సూచించారు.

బిఎల్‌ఓలు తమ విధులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్)2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏ) చురుకుగా పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

ఏఈఆర్‌లు, ఇఆర్‌ఓలు విస్తృతంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహించి, బిఎల్‌ఓలకు అవసరమైన సూచనలు అందించి ప్రజలతో అనుసంధానం పెంచాలని, ఓటరు హెల్ప్‌లైన్ 1950, హెల్ప్‌డెస్క్ నంబర్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. డిఈఓలు, ఇఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలను సమీక్షి స్తూ, సామాజిక మాధ్యమాల్లో క్రమం తప్పకుండా వివరాలను ప్రచురించాలని, అధికారుల క్షేత్ర పర్యటనలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు.

ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపడంలో ఓటర్లకు సహాయపడే ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా బిఎల్‌ఓలకు మరో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్‌ఏసి)జి.ఎస్. చారి, అన్ని నోడల్ అధికారులు, పీఎం (ఐటీ), సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

# ట్రంప్ విశేషాధికారాలను సమర్థించిన సుప్రీంకోర్టు

### స్వతంత్ర సమాఖ్యల అధిపతులను తొలగించే అధికారం

**వాషింగ్టన్, జూన్ 29:** అమెరికా అధ్యక్షుడి అధికారాలకు సుప్రీంకోర్టు భారీ ఊతం ఇచ్చింది. ఫెడరల్ రిజర్వ్‌కు మాత్రం మినహాయింపు అమెరికా అధ్యక్షుడి అధికారాలను విస్తరిస్తూ అమెరికా సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది.



స్వతంత్ర సమాఖ్య సంస్థల అధిపతులను అధ్యక్షుడు తొలగించే అధికారాన్ని సమర్థించింది. అయితే దేశ కేంద్ర బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ విషయంలో మాత్రం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లీసా కుక్‌ను తొలగించాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాన్ని ప్రస్తుతం అమలు చేయొద్దని కోర్టు పేర్కొంది. ఆమెపై ఉన్న మార్ట్గేజ్ మోసం ఆరోపణలను కుక్ ఖండించారు. తనపై కేసు పూర్తయ్యే వరకు ఆమె పదవిలో కొనసాగేందుకు అనుమతి ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని ధర్మాసనం, 91 ఏళ్ల క్రితం వచ్చిన చారిత్రక తీర్పును పక్కనపెడుతూ, రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి విరుద్ధంగా ఉన్న రక్షణలను కొనసాగించలేమని స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రభావం ఫెడరల్ ట్రేడ్ కమిషన్, నేషనల్ లేబర్ రిలేషన్స్ బోర్డ్, మెరిట్ సిస్టమ్స్ ప్రొటెక్షన్ బోర్డ్, కన్స్యూమర్ ప్రొడక్ట్ సేఫ్టీ కమిషన్ వంటి పలు స్వతంత్ర సంస్థలపై కూడా పడనుంది. తీర్పును స్వాగతించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇది అధ్యక్ష అధికారాలకు సంబంధించిన అత్యంత చారిత్రాత్మక నిర్ణయాల్లో ఒకటని పేర్కొన్నారు. ఈ తీర్పుపై విభేదించిన న్యాయమూర్తి సోనియా సోటోమేయర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల అధ్యక్షుడికి అపూర్వమైన అధికారం లభించిందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. సెంట్రల్ బ్యాంకు గవర్నర్లలో ఒకరైన లీసా కుక్‌ను తొలగించాలన్న ట్రంప్ ప్రయత్నం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు. వడ్డీ రేట్లపై ప్రభావం చూపేందుకు ఫెడరల్ రిజర్వ్‌పై నియంత్రణ సాధించాలనే లక్ష్యంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు వారు అంటున్నారు. కుక్‌పై మిచిగన్, జార్జియా రాష్ట్రాల్లోని రెండు ఇళ్లను ఒకేసారి ప్రధాన నివాసంగా చూపించి తక్కువ వడ్డీ రేటుతో రుణాలు పొందేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తనపై ఎలాంటి క్రిమినల్ కేసు కూడా నమోదు కాలేదని లీసా కుక్ స్పష్టం చేశారు.

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారానికి మరింత ఊతం

### రెండు ప్రాంతాల సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే వేదిక: మంత్రి జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణకొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ కొరియన్ కల్చరల్ సెంటర్‌లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ–కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ (కెసిసిఐ) డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణకొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు.

## నూకపల్లిలో దారుణం

### భార్యను హతమార్చి భర్త బలవర్మరణం

### అనాథగా మారిన ఆరేళ్ల దత్తత కుమారుడు

**మల్యాల, ప్రభాతవార్త:** మల్యాల మండలంలో నూకపల్లి గ్రామంలో సోమవారం కట్టుకున్న భార్య ను గొంతు నులిమి చంపి భర్త ఆత్మహత్యకు పాల్పడ్డ దారుణ సంఘటన గ్రామంలో విషాదం నెలకొంది, స్థానికులు కథనం మేరకు, గ్రామానికి చెందిన వోలపు నాగరాజు (40) భార్య లక్ష్మి (35) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ ఉండగా, వీరికి సంతానం లేనందున గత ఆరేళ్ల క్రితం క్రితం శ్రేయాన్ (6) అనే బాబును దత్తత తీసుకొన్నారు, కాగా నాగరాజు మద్యం కు బానిసైనందున తాగుడు మానాలని ఇంట్లో భార్య భర్తల మధ్య తరచూ గొడవ ఉండేవని అంటున్నారు, ఈ క్రమంలో నాగరాజు విషపూరిత మందు సేవించి ఆదివారం రాత్రి గాడ ఇంట్లో నిద్రలో ఉన్న భార్య లక్ష్మి ని టవల్ తో గొంతు నలిమి హతమార్చినట్లు తెలిసింది, భార్య చనిపోయిన తర్వాత భర్త నాగరాజు కూడా అదే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు, ఈ ఘటన సోమవారం తెల్లవారు వెలుగులోకి రావడంతో సంఘటన స్థలానికి మల్యాల సిఐ రాజ్ కుమార్, మల్యాల ఎస్సై సందీప్ చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు, అయితే ఈ దారుణానికి గల కారణాలపై పోలీసులు లోతుగా విచారణ ప్రారంభించారు, భార్యను హత్య చేసి భర్త కూడా ఆత్మ హత్య చేసుకోవడం సంచలనం రేపింది, కాగా ఈ సంఘటనలో తల్లి దండ్రులను కోల్పోయిన దత్తత బాలుడు అనాధగా మిగిలాడు, ఈ సంఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది, ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించినట్లు మల్యాల సిఐ మాదాసు రాజకుమార్ వెల్లడించారు.

## 6వ తేదీ వరకు వర్షాలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** రాష్ట్రవ్యాప్తంగా జూలై 6 వరకు కొన్ని జిల్లాల్లోని అక్కడక్కడా భారీ వర్షాలు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ శాఖ సోమవారం పేర్కొంది. దీని ప్రకారం మంగళ, బుధవారాల మధ్య ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు (64.5 మి.మీ నుండి 115.5 మి.మీ వరకు) కురిసే అవకాశం ఉందని అంచనా. గురు, శుక్రవారాల్లో ఆదిలాబాద్, కొమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్త గూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 4 వరకు ఎల్లో అలర్ట్‌లు జారీ అయ్యాయి. గంటకు 30 నుం చి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో సురక్షితమైన కాంక్రీట్ భవనాల్లో ఆశ్రయం పొందడం సురక్షితం. పొలాల్లో పనిచేసే రైతులు చెట్ల కింద ఉండకుండా జాగ్రత్త పడాలి. విద్యుత్ లైన్లు, స్తంభాలకు దూరంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉంది కాబట్టి నివాసితులు అప్రమత్తంగా ఉండాలి. వాహనదారులు భారీ వర్షం కురిసినప్పుడు వాహనాలను పక్కన ఆపి వర్షం తగ్గే వరకు వేచి ఉండటం మంచిది. అధికారులు జారీ చేసిన ఎల్లో అలర్ట్ సూచనలను పాటిస్తూ ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించుకోవాలి.

# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది

### అభివృద్ధి-మానవీయత రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతాం

### భూసేకరణ, పునరావాసంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మూసి నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ, పునరావాసం తదితర అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి సోమవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈ.వి. నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసి నదిని పునరుజ్జీవింపజేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణ హితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమని వివరించారు. మూసీ నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని తెలిపారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేసినట్టుగా మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో ప్రజా కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు.

## త్రిభాషా విధానం నుంచి సిబిఎస్ఇ టెన్త్ బ్యాచ్‌కు మినహాయింపు

### 9వ తరగతి విద్యార్థులకు విదేశీ భాషలు నేర్చుకునే ఛాన్స్

### నిబంధనలు సడలించిన సిబిఎస్ఇ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) త్రిభాషా విధానంలో సడలింపులు కల్పించింది. ప్రస్తుత 10వ తరగతి బ్యాచ్‌కు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇచ్చింది. అలాగే 9వ తరగతి విద్యార్థులకు విదేశీ భాషలు నేర్చుకునే ఛాన్స్ కల్పించింది. సీబీఎస్ఈ తన త్రిభాషా విధానం అమలుకు సంబంధించి కొత్త మార్గదర్శకాలను సోమవారం జారీ చేసింది. ప్రస్తుత 10వ తరగతి విద్యార్థులు మూడు భాషలు చదవాలనే (త్రిభాషా విధానం) నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. అలాగే ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వన్‌టైమ్ సడలింపు ఇచ్చింది. ఈ 9వ తరగతి విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలు చదవాల్సి ఉంటుందని వారు ఒక భారతీయ భాషతో పాటు, రెండు విదేశీ భాషలను ఎంచుకోవచ్చని స్పష్టం చేసింది. జులై 1 నుంచి ప్రారంభమయ్యే 9వ తరగతి బ్యాచ్‌విద్యార్థులు 3 భాషలు కచ్చితంగా నేర్చుకోవాలని, వాటిలో కనీసం 2 స్థానిక భారతీయ భాషలు ఉండాలని స్పష్టం చేస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఎస్‌జారీ చేసిన ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే సీబీఎస్ఈ తాజాగా సోమవారం సడలింపు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు త్రిభాషా విధానాన్ని అనుసరించాల్సిన అవసరం లేదని, 7 నుంచి 9వ తరగతి బ్యాచ్‌ల విద్యార్థులు 10వ తరగతికి వెళ్లినప్పుడు, వారు మూడో భాషలో బోర్డు పరీక్షలు రాయాల్సిన అవసరం లేదని సీబీఎస్‌అకడమిక్స్ డైరెక్టర్ ప్రగ్యా ఎం.సింగ్‌ప్రకటనలో పేర్కొన్నారు. వన్‌టైమ్ రిలాక్సేషన్ కింద 2026-27 విద్యా సంవత్సరానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు రెండు స్థానికేతర (విదేశీ) భాషలను ఎంచుకోవచ్చని, మూడో భాషగా కచ్చితంగా ఒక భారతీయ భాషను ఎంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏప్రిల్‌లో 6వ తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని దశలవారీగా అమలు చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# సింగరేణిలో తొలి క్యాథ్‌ల్యాబ్

### కార్మికులకు అత్యాధునిక గుండెవైద్య సేవలు

### సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** దేశానికి వెలుగులు పంచే కార్మికుల ఆరోగ్య పరిరక్షణ దిశగా సింగరేణి సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థకు గుండెకాయగా ఉన్న కార్మికుల హృదయాలకు గట్టి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను రామగుండం1 ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది. త్వరలో లాంఛనంగా ప్రారంభానికి సిద్ధంగా ఉందని సోమవారం ఒక ప్రకటనలో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. సంస్థ ఉద్యోగులు ఎక్కువగా దాదాపు 33 వేల మంది నివసించే గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి సంస్థ తొలి క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. దీంతో పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో నివసిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత సింగరేణి ఉద్యోగులతోపాటు సమీప గ్రామాల ప్రజల హృదయాలకు సింగరేణి గట్టి భరోసాను ఇచ్చినట్లు అయ్యిందన్నారు. సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో కంపెనీ ఆధ్వర్యంలో అనేక ఆధునిక వైద్య సౌకర్యాలు గల ఏరియా ఆసుపత్రులు ఉన్నప్పటికీ అందులో కార్డియాక్ సంబంధిత సేవలు పరిమిత స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం కోసం సింగరేణి సంస్థ ఏటా 300 కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తోందని వెల్లడించారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్ కోసం ఏడేళ్లలో సింగరేణి సంస్థ దాదాపు 50 కోట్ల ఖర్చును భరించనుందని పేర్కొన్నారు.



కాగా ఇప్పటి వరకు గుండెపోటు వచ్చిన రోగులను హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి సుదూర నగరాలకు తరలించాల్సి వచ్చేదని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడే గోల్డెన్ అవర్ వైద్యం గుండెపోటు వచ్చిన తొలి గంట అత్యంత కీలకం. అదే సమయంలో యాంజి యోగ్రామ్, యాంజియోప్లాస్టీ వంటి చికిత్సలు అందితే రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ అత్యవసర సేవల ప్రాధాన్యతను గుర్తించిన సింగరేణి యాజమాన్యం, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అత్యాధునిక సాంకేతికతతో ఈ క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బొగ్గు బెల్ట్ ప్రజలకు సకాలంలో, తక్కువ వ్యవధిలోనే అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఇక సుదూర ప్రాంతాలకు తరలించకుండా, ఇకపై గోల్డెన్ అవర్‌లోనే అత్యవసర చికిత్స అందించడం ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడే కేంద్రంగా గోదావరిఖని క్యాథ్ ల్యాబ్ నిలవనుందని ఆయన పేర్కొన్నారు.

## తొలి విడతలో 41.37 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి

### నేడు 2 ఎకరాల వరకు రైతు భరోసా నిధుల జమ

### మిగతా వారికి దశలవారీగా విడుదల చేస్తాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** ఈ సీజన్‌లో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు వేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ, మెగా రైతు మేళా వాయిదా పడినా, రైతు భరోసా మాత్రం యదావిధిగా విడుదల చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వర్షాలు ఇప్పుడిప్పుడే విస్తరిస్తుండటంతో విత్తనాలు వేసే సమయంలోనే రైతు భరోసా పెట్టుబడి సాయం విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చే 2500 మంది రైతులు పాల్గొంటారని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు దశలవారీగా జమ చేయనున్నట్లు వెల్లడించారు. తొలి విడతలో రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లను జమ చేయనుందన్నారు. ఈ తొలి విడతలో ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది కోసం రూ.878.94 కోట్లు, అలాగే రెండు ఎకరాల వరకు 26.72 లక్షల మందికి రూ.1,603.08 కోట్లు విడుదల చేస్తుందని పేర్కొన్నారు. మిగిలిన రైతులకు కూడా దశలవారీగా రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు జులై 5 లోపు సమీప వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి బ్యాంకు అకౌంట్ వివరాలు సమర్పించినట్లయితే వారు కూడా రైతు భరోసా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

## ప్రిన్సిపాల్‌పై దాడి

### నిజామాబాద్ బిజెపి నేత బాలు అరెస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్29:** స్కూల్‌లో ఉర్దూ బోధించడంపై చెలరేగిన వివాదం తీవ్రరూపం దాల్చింది. ప్రిన్సిపాల్‌పై దాడి చేసినందుకు గాను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు మందుల బాలును సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై తీవ్ర దుమారం రేగడంతో పోలీసులపై ఒత్తిడి పెరిగింది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డికి చెందినదిగా చెబుతున్న అంకాపూర్‌లోని ఒక గెస్ట్ హౌస్‌లో ఉన్న బాలును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ క్రమంలో బాలు, అతని మద్దతుదారులు పోలీసులను ప్రతిఘటించడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బాలును బలవంతంగా వాహనంలోకి ఎక్కించి తీసుకెళ్లారు. ఈనెల 27న ఆర్మూర్‌లోని భారత్ చంద్ర స్కూల్ ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్‌పై మందుల బాలు, అతని మద్దతుదారులు దాడి చేశారు. స్కూల్‌లో ఉర్దూ బోధించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక పోలీస్ అధికారి సమక్షంలోనే బాలు ప్రిన్సిపాల్‌ను చెంపపై కొట్టడం, దుర్భాషలాడటం వంటి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో పోలీసుల తీరుపై, బీజేపీ నేత తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఉర్దూతో పాటు విద్యార్థులకు నమాజ్ వంటి మతపరమైన పద్ధతులు నేర్పుతున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు.

అయితే, ఈ ఆరోపణలను స్కూల్ యాజమాన్యం ఖండించింది. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఉర్దూను రెండో భాషగా ప్రవేశపెట్టాలని యాజమాన్యం నిర్ణయించిందని స్కూల్ కరస్పాండెంట్ మల్లయ్య వివరించారు. ఈ ఘటనపై స్కూల్ కరస్పాండెంట్ మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు బాలుపై స్కూల్లోకి నేరపూరిత చొరబాటు, దాడి, ఇతర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే సమయంలో, ఆర్మూర్ తహసీల్దార్ సత్యనారాయణ.. స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌పై వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారంటూ కౌంటర్ కేసు నమోదు చేయడం గమనార్హం.

## బిఎల్‌ఒ విధుల్లో అంగన్‌వాడీ టీచర్లున్న కేంద్రాలు

### ఉ.10 గంటల నుంచి మ.3 గంటల వరకు

### నడవనున్న అంగన్‌వాడీ కేంద్రాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్29:** ఎన్నికల సంబంధిత విధుల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్వో)గా విధులు నిర్వహిస్తున్న కారణంగా ప్రభావితమయ్యే అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా మెమో జారీ చేశారు.

నెల రోజులపాటు ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియను కొనసాగించాలని నేపథ్యంలో.. బిఎల్‌ఓ వి ధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇతర పనులు అప్పగించవద్దని ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అంగన్వాడి కేంద్రాల సమయపాలనలో రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక మార్పులు చేసింది. 2026 జూన్ 29 నుంచి జూలై 28 వరకు ఒక నెలపాటు, బీఎల్‌ఓ విధుల కారణంగా ప్రభావితమయ్యే అంగన్‌వాడీ కేంద్రాలు ప్రతిరోజూ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పనిచేస్తాయి.

## హరీశ్‌రావుకు అదుపుతప్పిన మానసికస్థితి

### ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు.. ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి?

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్29:** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను అని చెప్పారు.

## కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మండలి సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి

### రాష్ట్రం తరపున హాజరైన క్రిస్టినా జడ్ చొంగ్తూ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన 16వ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మండలి(సీసీహెచ్ ఎఫ్‌డబ్ల్యూ) సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనివార్య కారణాల వల్ల రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఢిల్లీ పర్యటన రద్దు కావడంతో, తెలంగాణ తరపున ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రం తరపున అధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర, రాష్ట్రాల మధ్య చర్చలు జరిగాయి.

## 6,429 బస్తాల యూరియా మాయం

### వ్యవసాయ అధికారిపై వేటు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కొందరు ఎరువుల వ్యాపారులు ఎరువులను పక్కదారి పట్టిస్తూ బ్లాక్‌మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ప్రధానంగా కాసులు కక్కుర్తితో యూరియా బస్తాలను దారి మళ్లిస్తున్నారు. ఈ విధంగానే ఫెర్టిలైజర్స్ యాప్ ద్వారా ఏకంగా 6,429 యూరియా బస్తాను పక్కదారి పట్టించిన సంఘటన జరిగింది. రైతులకు రూ.266 చొప్పున విక్రయించాల్సిన బస్తాను సదరు వ్యాపారులు రూ.1000 చొప్పున ఓ బాంబుల పరిశ్రమకు అమ్మి డబ్బు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ అధికారుల వివరాలు ప్రకారం రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లాలో కొందరు వ్యాపారులు రైతులకు విక్రయించాల్సిన ఒకటి, రెండు కాదు ఏకంగా 6,429 యూరియా బస్తాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. మరోపక్క, యూరియా బస్తాలు పక్కదారి పట్టినా పట్టించుకోకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చేర్యాల వ్యవసాయ శాఖ అధికారిని ఉన్నతాధికారులు మరో విభాగానికి బదిలీ కూడా చేసినట్లు ఉన్నతాధికారవర్గాలు వెల్లడించాయి.

## ఇరిగేషన్‌లో అవినీతి చేప

### లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎఇఇ


**అశ్వారావుపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు మరోసారి వణుకు పుట్టించారు. అశ్వారావుపేట పట్టణంలో ఓ రైతు నుండి రూ.2 లక్షల భారీ మొత్తాన్ని లంచంగా తీసుకుంటూ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఈఈ) ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. అశ్వారావుపేట పట్టణంలోని దొంతికుంట చెరువు నుండి తన పొలానికి మట్టి తోలుకునేందుకు ఓ స్థానిక రైతు ఇరిగేషన్ అధికారులను ఆశ్రయించారు. అయితే ఆ మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వాలంటే రూ.2 లక్షలు లంచం సమర్పించుకోవాలని ఇరిగేషన్ ఏఈఈ ఎల్ శ్రీనివాస్ సదరు రైతును డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇచ్చుకోలేక, అవినీతి అధికారికి బుద్ధి చెప్పాలనుకున్న రైతు తక్షణమే ఖమ్మం రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రైతు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఖమ్మం రేంజ్ ఏసీబీ డీఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలోని బృందం పక్కా వ్యూహంతో అశ్వారావుపేటలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిఘా పెట్టింది. సోమవారం ఏఈఈ శ్రీనివాస్ తన కార్యాలయంలో రైతు నుండి రూ.2 లక్షల నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా (నగదుతో సహా) పట్టుకున్నారు. అధికారి చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నట్లు నిర్ధారించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను స్వాధీనం చేసుకుని ఏఈఈ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో వరుసగా జరుగుతున్న ఏసీబీ దాడులు ప్రభుత్వ కార్యాలయాల్లో కలకలం రేపుతున్నాయి.



పట్టుబడిన ఇంజనీర్

# రైతులకు అండగా ఉంటాం

● ఏరువాక పున్నమి శుభాకాంక్షలు చెప్పిన సిఎం చంద్రబాబు



**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు సిఎం చంద్రబాబు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు 'ఎక్స్' సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. "జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు రైతన్నలు భూమిని, పశుసంపదను పూజించి ప్రకృతితో అనుసంధానం అయ్యే కార్యక్రమం ఏరువాక. పాడి పంటలతో రైతన్నల ఇళ్లలో వెలుగులు నిండాలని ప్రార్థిస్తున్నాను. ప్రకృతిని పూజించే గొప్ప పద్ధతి మనం ఆ సాంప్రదాయాలను పాటిద్దాం. ప్రకృతి సాగుతో పంటలు పండించి మన భూమిని, మన ఆరోగ్యాన్ని విషతుల్యం కాకుండా కాపాడుకుందాం. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ తోడు నిలుస్తుంది. ఇందులో భాగంగానే అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ నిధులు జమ చేసి వారికి అండగా నిలిచాం. ఎల్ నినో, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా తలెత్తే సవాళ్లను రైతన్నలు అధిగమించాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటిస్తూ రైతన్నలు సాగుతో సిరులు పండించాలని ఆకాంక్షిస్తున్నా" అని సిఎం చంద్రబాబు అన్నారు.

## వ్యవసాయరంగంలో అనేక సంస్కరణలు

● రైతులకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపిన డి.సిఎం



**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులను లాభాలు పెంచే దిశలో వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలను తీసుకుని వస్తామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలోని రైతు సోదరులకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలియజేశారు. జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన జరుపుకునే ఈ పండుగ.. భూమాతకు, పశుసంపదకు గౌరవం ఇస్తూ.. ప్రకృతికి మనిషికి మధ్య ఉన్న విడదీయలేని అనుబంధాన్ని చాటుతుంది అని ఆయన పేర్కొన్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని రైతులు భూమికి పూజలు నిర్వహించి, నూతనోత్సాహంతో సాగు పనులకు శ్రీకారం చుడతారని పవన్ కళ్యాణ్ తన సందేశంలో తెలిపారు. సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, తద్వారా అన్నదాతలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదికగా ఆయన సందేశాన్ని పంచుకున్నారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కళ్యాణ్ పునరుద్ఘాటించారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా ఇప్పటికే పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం మొదటి విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. త్వరలో ప్రారంభం కానున్న 'విబి జిరాంజీ' పథకం ద్వారా కూడా రైతులకు మేలు చేకూరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక విధానాలతో పనిచేస్తోందని పవన్ స్పష్టం చేశారు.

# రైతు రాజైతే.. రాజ్యం సుభిక్షమవుతుంది

● వ్యవసాయ రంగ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం ● త్వరలో పోలవరం పూర్తి చేసి రైతాంగానికి అంకితమిస్తాం ● ఏరువాక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర



ఎరువాక కార్యక్రమంలో అరక దున్నుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ వీలైనంత త్వరగా పూర్తి చేసి రైతాంగానికి అంకితమిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగం సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం బుద్దాలపాలెంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో కలిసి భూదేవికి పూజలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. రైతులకు ఎరువులు, విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, రైతుని, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. "రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రైతాంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.58 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కూడా చంద్రబాబు నాయుడిదే. రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఏ సీజన్‌లో ఎలాంటి పంటలు వేస్తే లాభసాటిగా ఉంటుందో వ్యవసాయ అధికారులతో సలహాలు సూచనలు అందిస్తున్నాం. నీటి సంఘాలను ఏర్పాటు చేసి సాగునీటి కాలువలన్నీ బాగు చేసుకున్నాం. బందరు నియోజకవర్గంలోని రూ.3 కోట్లతో సాగునీటి కాలువలను అభివృద్ధి చేశాం. ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేశాం. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాం" అని మంత్రి వివరించారు.

"గతంలో పండిన పంటను అమ్ముకునే దిక్కులేదు. డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియదు. కానీ నేడు పంట అమ్ముకున్న 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. సాగునీటికి ఇబ్బందులు లేకుండా పట్టిసీమ నిర్మాణంతో కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేశాం. పొరుగు రాష్ట్రం ప్రయోజనాల కోసం జగన్ రెడ్డి పోలవరం ప్రాజెక్టును పాడుబెట్టాలని ప్రయత్నిస్తే కూటమి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగం పెంచాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తాం. గ్రావిటీ ద్వారా సాగునీరు అందిస్తాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తున్నాం.

గతంలో కేంద్రం ఇచ్చే సొమ్ము మాత్రమే రైతుల ఖాతాల్లో వేసి ఉద్ధరించినట్లు చెప్పుకున్నారు. కానీ మనం కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రూ.14 వేలు చేర్చి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తున్నాం. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం" అని పేర్కొన్నారు.

జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మనం ఇటుక ఇటుక పేర్చి నిర్మాణం చేస్తుంటే జగన్ రెడ్డి లాంటి వాళ్లు వచ్చి కూలగొడుతున్నారు. ఒకే ప్రభుత్వం పాతికేళ్లు నిలకడగా ఉండాలి. అప్పుడే మనం అభివృద్ధిని సాధించగలుగుతాం. గతంలో గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కొనసాగడంతోనే అభివృద్ధి శాశ్వతంగా నిలిచింది. అదే స్ఫూర్తి ఇక్కడా చూపిస్తే ఎపిని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపి చూపిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



## అరక పట్టి విత్తనం వేసిన రాప్తాడు ఎమ్మెల్యే

● ప్రతి రైతు పంట వేయాలి ● ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్న పరిటాల సునీత ● ఎలినినో ప్రభావం వల్ల వరి పంట వేయొద్దని రైతులకు సూచన

**అనంతపురం, జూన్ 29 ప్రభాతవార్త బ్యూరో:** అన్నదాతలకు ప్రత్యేక పండుగ ఏరువాక పౌర్ణమి.. రాప్తాడు నియోజకవర్గంలో సందడిగా సాగింది. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సమీపంలో సోమవారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, టిడిపి నాయకులతో కలిసి ఆమె పొలాల్లో పర్యటించారు. రైతు పోతన్న పొలంలో అధికారులు, కూటమి నాయకులతో కలిసి "ఏరువాక పౌర్ణమి" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీత స్వయంగా అరక పట్టి.. కంది విత్తనాలు వేశారు. రైతులతో కలిసి సందడిగా విత్తనం సాగులో పాల్గొన్నారు. అనంతరం రైతులతో సమావేశమై పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. ఏరువాక పౌర్ణమి అంటే రైతులకు సంబంధించి అతి ముఖ్యమైన పండుగ అన్నారు. గతంలో జేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజున రైతులంతా తమ పశువులకు పూజలు చేసి.. విత్తనం వేయడం ప్రారంభిస్తారన్నారు. గతంలో తాను ఎన్నో సార్లు ఇలాంటివి చేశానని గుర్తు చేసుకున్నారు. రైతులంతా కచ్చితంగా తమ పొలంలో ఏదో ఒ క పంట వేయాలన్నారు. వేరుసెనగ, కందితో పాటు నవ ధాన్యాల సాగు కూడా చేయాలన్నారు. ఇప్పటికే రైతులకు అవసరమైన విత్తనాన్ని ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందన్నారు. తాను కూడా కంది కొనుగోలు చేశానని, వర్షం రాగానే మా పొలంలో కూడా విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విత్తనంతో పాటు ఎరువులు కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇవన్నీ రైతులకు సక్రమంగా అందజేయడంతో పాటు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత అధికారులను ఆదేశించారు. ఈసారి ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని.. రైతులు కూడా నీరు ఉన్న చోట వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేయవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## సస్పెన్షన్‌లో ఉన్న ఐపిఎస్ సునీల్ రిటైర్మెంట్ నోటిఫికేషన్ జారీ

**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ సునీల్ రిటైర్మెంట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. జూన్ 30వ తేదీ మంగళవారం పదవీ విరమణ దృష్ట్యా సర్వీసు నుంచి రిలీవ్ చేయడానికి ఉత్తర్వులు వచ్చాయి. సునీల్‌పై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, నేర విచారణలకు భంగం కలగకుండా సర్వీసు నుంచి రిలీవ్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. ఆయనకు చట్టపరంగా లభించాల్సిన లబ్ధి తదితరంశాలపై ఐఏఎస్ సర్వీసు నిబంధనలను అనుసరించే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేసారు. ఇక రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్ సైతం మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన విరమణ తర్వాత కృపానంద్ త్రిపాఠికి బాధ్యతలు అప్పగించనున్నారు. నేడు సర్వీసులో చేరిన ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి కూడా మంగళవారం పదవి విరమణ చేస్తున్నారు.

## స్పెషల్ సిఎస్‌గా శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

● నేడు పదవీ విరమణ చేయనున్న ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మి



**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐఏఎస్ శ్రీలక్ష్మి రెండేళ్ల తరువాత తిరిగి విధుల్లో చేరారు. కీలక బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నుంచి శ్రీలక్ష్మికి పోస్టింగ్ దక్కలేదు. గత వారం శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం శ్రీలక్ష్మి సాధారణ పరిపాలన శాఖలోని జిపిఎం అండ్ ఏఆర్ విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టులో శ్రీలక్ష్మీ మంగళవారం వరకు మాత్రమే కొనసాగే అవకాశం ఉంది. జగన్ సిఎంగా ఉన్న సమయంలో తెలంగాణ నుంచి ఎపి కేడర్‌కు వచ్చిన శ్రీలక్ష్మికి జగన్ కీలక బాధ్యతలు అప్పగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శ్రీలక్ష్మికి పోస్టింగ్ దక్కలేదు. గత వారం శ్రీలక్ష్మికి ప్రభుత్వం ఎట్టకేలకు పోస్టింగ్ ఇచ్చింది.

1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై.శ్రీలక్ష్మికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్‌లో ఉంచారు. కాగా, పదవీ విరమణకు ఒక్క రోజు ముందు బాధ్యతల్లో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన శ్రీలక్ష్మి, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్ధన్ రెడ్డికి అనుకూలంగా జిఒలు ఇచ్చారనే ఆరోపణలపై సిబిఐ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కాగా.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఎపిలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఎపికి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఎపి కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

## కాణిపాకంలో శాస్త్రోక్తంగా సత్యనారాయణవ్రతం



వరదరాజ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు


**కాణిపాకం, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో సోమవారం సత్యనారాయణ వ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈ వ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణ వ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్య నారాయణస్వామి వ్రత మహత్యాన్ని, వ్రతాన్ని ఆచరించడం వల్ల కలిగే శుభ ఫలితాలను అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పున్నమి గరుడసేవ:** శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ వ్రతంను నిర్వహించగా రాత్రి గరుడసేవను నిర్వహించారు. ఆసందర భంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఫ్రెండ్లీగా కూటమి ప్రభుత్వం

● సిఎం చంద్రబాబును కలిసిన వివిధ ఉద్యోగ సంఘాల నేతలు



**విజయవాడ, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగులకు మేలు చేసేలా ఇటీవల కెబినెట్ తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. 2004 సెప్టెంబర్ ముందు వివిధ నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం వర్తింపచేయడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేషన్లకు చెందిన సంస్థలు, గురుకులాలకు చెందిన ఉద్యోగులకు పదవి విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచడం వంటి నిర్ణయాలు తీసుకుంది. గత కెబినెట్లో ఈ నిర్ణయాలు తీసుకున్నప్పటి నుంచి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలుస్తూనే ఉన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం చేసిన మేలును మరువలేమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

కూటమి ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటోందన్నారు. తాము ఉద్యోగులకు సహకరించినట్టే ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్య మంత్రి సూచించారు. ఏపీఆర్ఈఐ సొసైటీతో పాటు.. వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సంస్థల సొసైటీలు, డీఎస్సీ 2003 టీచర్ల ఫోరంనకు చెందిన ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో గురుకులాల జేఏసీ నాయకులు దామచర్ల మధుసూదన రావు, ప్రభాకర్, రామ్మోహన్ రావు, రమేష్, డీఎస్సీ 2003 ఫోరం ప్రతినిధులు మోపిదేవి శివ శంకర్రావు, గురు బ్రహ్మం, రాజేష్ ఉన్నారు.

# తిరుమల సమాచారం



## టిటిడి ట్రస్టులకు రూ.1.10 కోట్లు విరాళం

**తిరుమల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా భారీగా విరాళాలు అందిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన లెవెన్ హోల్డింగ్స్ సంస్థ టిటిడి నిర్వహిస్తున్న వివిధ ధార్మిక, సేవా ట్రస్టులకు రూ1.10 కోట్లు విరాళాన్ని అందించింది. సంస్థ మేనేజింగ్ పార్టనర్ వెంకటరవికుమార్ తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళాల డిడిలను అందజేశారు. ఇందులో ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు ఒక కోటి రూపాయలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

## ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాల్లో ఎస్వీప్రాణదానం కూడా ఒకటి ప్రధానమైంది. దాతలు ఈ ట్రస్ట్‌కు తమవంతు విరాళాలు అందిస్తున్నారు. కాకినాడకు చెందిన వి.ఎస్.ఎన్ నిర్మాణ రంగం సంస్థ సోమవారం ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు తిరుపతి టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం చెక్‌ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.ఎస్.ఎన్. నిర్మాణ సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఆర్ఎస్ శాంతా రామ్, ప్రతినిధులు దుర్గా కామాక్షి, జాస్తి శ్రీనివాస రావు పాల్గొన్నారు.



## గరుడవాహనంపై సిరులతల్లి అభయం

**తిరుమల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మ వార్షిక తెప్పోత్సవాల్లో సోమవారం సాయంత్రం అమ్మవారు పద్మ పుష్కరిణిలో తెప్పపై విహరించి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు. అనంతరం గరుడవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు పద్మ పుష్కరిణి వద్దనున్న నీరాడ మండపంలో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన తెప్పోత్సవంలో అమ్మవారు భక్తులకు అభయప్రద దర్శనం ఇచ్చారు. తెప్పోత్సవాలకు మహా పూర్ణాహుతి జరిగింది.



## గంగమ్మ ఆలయంలో చండీహోమం

**తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఛండీహోమం నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు గణపతిహోమంతో మొదలుపెట్టి పూర్ణాహుతితో ముగించారు. హోమంలో పాల్గొన్న భక్తులందరికీ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఇఒ ఎ.జయకుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ హోమంలో ఎమ్మెల్యే శ్రీనివాసులు,టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



## దత్తాత్రేయ మందిరంలో రుద్రపాశుపత హోమం

**తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సోమవారం లింగసముద్రం మండలం మొగలిచెర్లలోని దత్తాత్రేయ మందిరంలో రుద్ర పాశుపత హోమం నిర్వహించారు. శత్రు బాధలు, తీవ్రమైన గ్రహదోషాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు, సర్వకార్య సిద్ధి లభిస్తాయి. దత్తాత్రేయ స్వామి కొలువైన మొగిలిచర్ల మందిరంలో ఈ మహాకార్యం ఆలయ అర్చకులు వేదోక్తంగా జరిపించారు. మహాదేవుని పాశుపత అస్త్ర మంత్రాలతో ఈ హోమం జరిపించారు. హోమంలో పాల్గొనడంతో భక్తుల కర్మదోషాలు నశించి, భగవంతుని అభయ రక్షణతో పాటు అష్టైశ్వర్యాలు అత్యున్నత ఆధ్యాత్మిక శాంతి కలుగుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని విష్ణుకౌశిక్ తెలిపారు. హోమం అనంతరం మధ్యాహ్నం,రాత్రి గృహస్థభక్తులకు ఆలయంలో ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.

## తిరుపతి పేరుతో పోస్టులు దుమారం

● నకిలీ ప్రచారం నమ్మొద్దంటూ పోలీసులు విజ్ఞప్తి



**తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పేరును దుర్వినియోగం చేస్తూ సామాజిక మాధ్యమం వేదికగా ఫేస్‌బుక్లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అసభ్యకర, తప్పుడు ప్రకటనలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు హెచ్చరించారు. ఇందులో ప్రచారం చేస్తున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నిరాధారమని తిరుపతి జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడ ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి, ఈ నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలు, పోస్టులపై సమగ్ర విచారణ చేపట్టాయి. సంబంధిత వ్యక్తులను గుర్తించి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగుతున్నాయి. ఇలాంటి నకిలీ ప్రకటనలు, ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను చూసి ఎవరూ నమ్మవద్దని, వాటి ద్వారా ఎటువంటి లావాదేవీలు చేయవద్దని తిరుపతి జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద సోషల్ మీడియా పోస్టులు,ఖాతాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ డయల్ 112కుసమాచారం అందించాలని కోరుతున్నారు.


## తిరుమలలో కలకలం

## మహిళల వాష్‌రూముల్లోకి ఓ అగంతకుడి చొరబాటు

పట్టుకుని దేహశుద్ధి చేసిన మహిళలు



**తిరుమల, జూన్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకొండపై సోమవారం సాయంత్రం ఓ విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఏకంగా నిత్యం యాత్రికుల రాకపోకలతో, పోలీస్‌కాంప్లెక్స్‌కు సమీపంలోనే ఉన్న బాత్‌రూమ్‌ల వద్ద ఓ వ్యక్తి మహిళల వాష్‌రూమ్‌లోకి ప్రవేశించాడు. అక్కడ ఉన్న ఓ బాలిక వాష్‌రూమ్‌లో ఉండగానే విచిత్రంగా ప్రవర్తించాడు. బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పట్టుకుని దేహశుద్ధి చేశారు. తిరుమలలో ఇదీ కలకలం రేపింది. అంతేగాక మతిస్థిమితం లేని వ్యక్తిమహిళపై దాడికి యత్నించాడు. ఈ విషయం పెద్దది చేయొద్దని తల్లిదండ్రులు స్థానికులకు, మీడియాకు విజ్ఞప్తి చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే రైలు సమయం కావడంతో ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చిన భక్తులు తిరుపతికి బయలుదేరి వెళ్లిపోయారు. సమయానికి తల్లిదండ్రులు అప్రమత్తంగా స్పందించడంతో ఎలాంటి దురదృష్టకర ఘటన జరగకుండా తప్పిందని అక్కడున్న భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.



అందంగా మెరిసే ముఖంపై చిన్న మొటిమ వచ్చినా అమ్మాయిలకు ముచ్చెమటలు పోస్తాయి. ఇందుకు హార్మోన్ల ప్రభావంతో పాటు అధిక జిడ్డు, దుమ్మూధూళీ, **ఆహారపుటలవాట్లు..** వంటి ఎన్నో కారణాలు. అలాగని వీటిని తగ్గించుకోవడానికి ఖరీదైన క్రీములు వాడుతున్నారా? అవేం అక్కర్లేదు.. ఇంట్లోని పదార్థాలతో ఈ చిట్కాలు పాటించి

## ముత్యమంత మొటిమే కదా!

చూడండి. దాల్చిన చెక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలకు కారణమైన బ్యాక్టీరియాని చంపేస్తాయి. రెండు చెంచాలు తేనె,కాసిని పాలు, చెంచా దాల్చిన చెక్కపొడి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో ఇలా చేయడంవల్ల మొటిమలు తగ్గడమే కాదు,మచ్చలూ పోతాయి.జిడ్డుని తొలగించి మొటిమలు రాకుండా బొప్పాయి అడ్డుకుంటుంది. బాగా పండిన బొప్పాయి గుజ్జులో పంచదార, పెరుగు కలిపిముఖానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. అపై గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. రెండు చెంచాల నారింజ తొక్కల పొడికి తగినన్ని పాలు చేర్చి ముఖానికి రాసి ఇరవై నిమిషాల తరవాత కడిగేయాలి. వీటితో మొటిమలు తగ్గడమే కాదు చర్మం కొత్త మెరుపుతో కనిపి స్తుంది. కలబంద గుజ్జులో కాస్త నిమ్మరసం తేనె కలిపి రోజూ రాసి ఆరనివ్వండి ఇలా పదిహేను రోజులు చేస్తే క్రమంగా మొటిమలు తగ్గుముఖం పడతాయి. □

## దానాలు ఫలించాలంటే..

**దానం ఓ మహోత్తర కార్యం.** నువ్వు ఏ దానం అయినా చేయి కాని కుటుంబ అవసరాలు, నీ జీవితానికి సంబంధించినవి తీర్చుకుని దానం చేయి. అలా కాకుండ కొంత మంది మాకు దానం చేస్తే పుణ్యం వస్తుంది. మేము స్వర్గ సుఖాలు పొందవచ్చని మూఢంగా దానాలు చేస్తుంటారు. కుటుంబంలో కొడుకులు కావొచ్చు. కూతుర్లు కావొచ్చు వాళ్ల అవసరాలకు కొంత మంది, వాళ్ల అనారోగ్యంగా ఉన్నా ఖర్చు పెట్టరు. వేలకు, వేలు వివిధ సంస్థలకు డబ్బు దానం చేస్తుంటారు. అది వారి సొంత డబ్బు అయినా ఎంతో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని దానం చేస్తే బాగుంటుంది. ఇది కొంత మందికి నచ్చదు. అందుకే హాతమార్చడం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ ముదుసలికి నెల, నెల ప్రభుత్వ పింఛను వస్తుంది. ఆవిడను కొడుకు,కోడలు తరిమివేశారు. కూతురు ఇంటికి వచ్చినా ఆమె చేసే దానాలకు అంతులేదు కూతురు అనారోగ్యంగా ఉన్నా, ఏమి పట్టనట్లుగా డబ్బు దానం చేస్తుడటం ఆమె మూర్ఖత్వం. అట్టి దానాలు ఎప్పటికి ఫలించవు. వీళ్లేమో మేము దానాలు చేశాం మాకు పుణ్యం వస్తుంది అనుకుంటారు. నిజానికి వారు పాపం మూట గట్టుకుంటారు. మా డబ్బు పేదలకు చేరుతుంది కదా అనుకుంటారు. కానీ నీకు అన్ని సమాకూర్చే నీ వాళ్లకు నీవు ఏమి ఖర్చు పెట్టవు. నేను అంత చేశాను, ఇంత చేశాను అని వాళ్లకు మనసులో ఉండొచ్చు కాని ఏవి నీకు మంచి జరగదు. అవసాన దశలో నీవు నీ కుటుంబ సభ్యులు, వాళ్ళ రోగాలకు డబ్బు ఖర్చు పెడితే అదే నీకు పుణ్యం. నువ్వు చేసేది దానం అయినా, ఆ దానంలో నీ వాళ్లు కూడ ఉన్నారు. నీ వాళ్లకు ఖర్చు పెడితే ఆ పన్నులకు పెట్టినట్లే. ఇప్పటికైనా ఎవరైనా డబ్బు దానం చేయాలిసివస్తే ముందు కుటుంబ అవసరాలు, తర్వాత దానాలు చేస్తే అనంత ఫలితం వస్తుంది. భగవంతుడు కూడ వున్న దానిలో కొంచెం నాకు ఇస్తే నీకు పుణ్యం కలుగుతుంది అని మన పురాణ గ్రంధాలలో, వివిధ సద్గ్రంధాలలో కూడ ఉంది. మొత్తానికి వున్న దానిలో దానంచేస్తే కలిగే ప్రయోజనాలు ఎన్నో. □



## ఒత్తిడికి దూరంగా..

ఒత్తిడి మనకు పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. నిద్రలేమి, నెలసరి సమస్యలు.. ఇలా దీనికి కారణాలు బోలెడు. కాబట్టి ఓ రెండు నిమిషాలు ఇలా చేస్తే అది కాస్తా మటుమాయం. కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకొని వీలైనంత సేపు అలా పట్టి ఉంచండి. తర్వాత నెమ్మదిగా వదలాలి. ఈ పక్రియలో ధ్యాసంతా పొట్ట మీదే ఉంచాలి. ఇలా రెండు నిమిషాలు చేస్తే చాలు. ఈ వ్యాయామం నాడీవ్యవస్థను నెమ్మదింపజేసి.. ఒత్తిడిని దూరం చేస్తుంది. చిన్న చిన్న వార్మప్‌లు.. నడుముపై చేతులు ఉంచి వెనక్కి వాలడం, జాగింగ్, స్ట్రెచింగ్ వంటివీ చేయొచ్చు. వేగంగా కొద్దిసేపు నడిచినా ఫలితం కనిపిస్తుంది. నేల మీద కాళ్లు ముడుచుకొని కూర్చోవాలి. కళ్లు మూసి, మీరు ప్రేమించే వాళ్లనో.. మీకు ఆనందాన్నిచ్చే సందర్భాన్నో గుర్తు తెచ్చుకోండి. మనసు ఇతర అంశాల మీదకి మళ్లి ఆందోళన దూరం అవుతుంది. మనసు లగ్నం కావట్లేదనిపిస్తే ఎదురుగా ఉన్న వస్తువుని తదేకంగా చూడండి. కళ్లు మూసి మరోసారి ప్రయత్నించండి. మనసు తేలిక పడుతుంది.. ఇతరులతో పోలిస్తే మీరు ఏ అంశాల్లో మెరుగ్గా ఉన్నారో ఆలోచించుకోండి. కనీసం మూడు అంశాలను ఎతుక్కున్నా చాలు. జీవితం మీద సానుకూల భావన ఏర్పడు తుంది. ఇదీ ఒత్తిడిని తగ్గించే మార్గమే. పోనీ.. మంచి జోక్‌ని గుర్తుతెచ్చుకోండి.లేదా చదవండి.. నవ్వు ఎండార్ఫిన్లను విడుదల చేసి, ఒత్తిడిని దూరం చేస్తుంది. మొక్కల మధ్యకు వెళ్లండి. ఆ పూల సువాసనలు చూడండి. ఆ అవకాశం లేకపోతే ఆరోమా ఆయిల్‌ని వాసన చూడటమో.. సెంటెడ్ క్యాండిల్‌ని వెలిగించడమో చేసినా చాలు. ఇవి మనసును తేలికపరిచి ఒత్తిడిని తగ్గిస్తాయి. □



## శశి కాంచనం

నారీమణులకు నగలంటేనే ముఖం వెలిగిపోతుంది. కానీ ఒకామెకు కళ్లు చెదరగొట్టే అమూల్య ఆభరణాలు తనకు తారసపడినా చలించలేదు. ఎక్కడో ఆలోచనలో మెదడు పాడుచేసుకోలేదు. దానిని సొంతదారులకందించే వరకు నిద్రలేదంటే నమ్మండి. ఆమెలోని నిజాయితీ మహిళాలోకానికి మకుటాయమానం. జీవనోపాధికి చేస్తున్న ఉద్యోగం చిన్నదే అయినా కళ్లెదుట 'కనకపు సంచి' మెరుస్తూనే ఉన్నా ఆమె మనసు పాడుచేసుకోలేకపోవడమే ఇక్కడ చెప్పుకోవాలి. ఆమె అభినందనీయురాలు. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం తిరుపతిలో పెళ్లి వేడుకలో ఘనంగా నిర్వహించుకుని తిరుగు ప్రయాణ సమయంలో ఓ హ్యాండ్ బ్యాగ్ మరచిపోయారు. తీరా ఇంటికి చేరుకున్నాక దాదాపు 45 లక్షల రూపాయల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలున్న హ్యాండ్ బ్యాగ్ ఎక్కడో ఏ హోటల్‌లోనో పొగొట్టుకున్నాట్లు గుర్తించి ఆందోళన చెందారు. విషయం పోలీస్‌ల దాక వెళ్లి పెళ్లివారు చివర్లో ఆగిన తిరుపతి గరుడాద్రి హోటల్ క్యాషియర్ శశిని అడగ్గా ఆమె నోటివెంట పలికిన పలుకులు ఇక్కడ ప్రస్తావనార్హం. ఔను! ఒక హ్యాండ్ బ్యాగ్ దొరికింది. భద్రంగా దాచి ఉంచాం ఇదిగో! దాంతో పోయిన నగల సంచి సొంతదారుకు చేరింది. దాంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. శశి విధి నిర్వహణలో నిబద్ధత, బాధ్యత నిజాయితీని మెచ్చుకుని జిల్లా ఎస్‌పి సుబ్బారాయుడు శాలువాతో సత్కరించారు. □

## ఎక్స్‌పైరీ తేదీ చూడాలి!

మార్కెట్‌కెళ్లి ఏదైనా కొనుగోలు చేయాలంటే మనమేం చేయాలి. రూపొందించిన కంపెనీల లోగోలు చూద్దామా? ఏది తక్కువకు లభిస్తుందో బేరీజు వేసుకుంటారా.. అవన్నీ తర్వాత మనమైతే ముందు ఎక్స్‌పైరీ తేదీని గమనించాలి.

**రెండింటి మధ్య తేడా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్‌ని కూడా ఆయా సంస్థలు లేబుల్‌పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్యస్వల్ప వ్యత్యాసం ఉంటుంది.



**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.

**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్‌పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణా లతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు. షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్త పచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...** అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్‌ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్‌లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్‌పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్‌లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి. □

**చిట్కా :**
- అవకాయపచ్చడి జాడీలో కొంచెం బెల్లంపొడిపైన చెల్లితే బూజుపట్టదు.
- అటకులు రుచిగా వుండాలంటే కొబ్బరి కోరు యాలకులపొడి కొద్దిగా కలపండి.
- అల్లపురసమును తేనెతో కలిపి త్రాగిన ఎక్కిళ్లు పోవును.

## చిలగడ దుంప బజ్జీలు!



**కావలసిన పదార్థాలు:**
శనగపిండి: కప్పు
బియ్యప్పిండి: అరకప్పు
వాము: పావు స్పూను
కారం: ఒక స్పూను
ఉప్పు: తగినంత
సోడా ఉప్పు: చిటికెడు
చిలగడ దుంపలు: పెద్దవి రెండు
నూనె: వేయించడానికి సరిపడా

**తయారీ విధానం :** ముందుగా చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి పల్చగా పొడవాటి ముక్కలుగా తరిగి నీళ్లలో వేసి పక్కకు పెట్టుకోవాలి. ఒక గిన్నెలో శనగపిండిని తీసుకోవాలి. అందులో ఉప్పు, వాము, సోడా, కారం వేసి కొద్దిగా నీళ్ల పోయాలి. అంటే బజ్జీ వేసేందుకు వీలుగా జారుడుగా పిండి వచ్చేలా ఈ నీళ్లను పోసుకోవాలి. తర్వాత పిండిలో అన్నీ కలిసేలా బాగా కలియ బెట్టాలి. ఎంత కలిపితే బజ్జీలు అంత గుల్లగా వస్తాయి. ఇప్పుడు పొయ్యి మీద బాణలి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా కాగాక, ఇందాక కలిపి పెట్టుకున్న పిండిలో చిలగడదుంప ముక్కలను ముంచి అందులో వేయాలి. మంట తక్కువగా పెట్టి కాలిస్తే లోపలి చిలగడదుంప కూడా చక్కగా ఉడుకుతుంది. □

# తెర

## 'ENE Repeat' నవంబర్ 19న రిలీజ్



యూత్ లో చెరగని ముద్ర వేసుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం ఇప్పుడు సీక్వెల్ ENE Repeat తో సిద్ధమవుతోంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఆ మ్యాజిక్‌ను మళ్లీ క్రియేట్ చేయడానికి రీయూనియన్ అవుతుండగా, శ్రీనాథ్ మాగంటి ఈ టీంకు కొత్త ఉత్సాహాన్ని జోడిస్తున్నారు. తరుణ్ భాస్కర్ మరోసారి దర్శకత్వం వహిస్తుండగా, ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా ప్రపంచవ్యాప్త నవంబర్ 19ని విడుదల కానుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. చిత్రం (మొదటి భాగం) విడుదలై ఎనిమిది ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఆనాటి 'కన్యా రాశి' గ్యాంగ్ జ్ఞాపకాలను గుర్తు చేసేలా, అందరినీ ఆకట్టుకునే ఫ్రెండ్షిప్ యాంథమ్ నేపథ్యంతో ఒక 'ఫీల్ గుడ్' వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది.? పార్ట్ వన్ లోని ప్రత్యేకతను కొనసాగించేలా ఈ సీక్వెల్‌కు ట్యాలెంటెడ్‌టెక్నికల్ టీం పని చేస్తోంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా, ఏజే ఆరోన్ సినిమా టోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటింగ్ చేస్తుండగా, రాజేష్ పెంటకోట, సాలీ వైట్ ప్రొడక్షన్ డిజైన్‌ను రూపొంది స్తున్నారు .విడుదల తేదీని ప్రకటించిన నేపథ్యంల త్వరలోనే చిత్ర ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు.

## #RAPO23 పూజా కార్యక్రమంతో షూటింగ్ ప్రారంభం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక మైన చిత్రం #RAPO23 అధికారికంగా లాంచ్ చేశారు. ఎన్నో ఏళ్ల పాషన్, ప్లానింగ్ తో రూపుదిద్దుకున్న ఈ చిత్రంతో రామ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ తెరకెక్కుతున్న చిత్రం ఇది.ఈ చిత్రం ఈరోజు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. నిర్మాత కృష్ణ పోతినేని స్క్రిప్ట్ ను రామ్ పోతినేనికి అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి పి. మురళీ మోహన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, పి.వి. రవి కిషోర్ క్లాప్ కొట్టారు. దర్శకుడిగా తన ప్రయాణానికి శ్రీకారం చుడుతూ తొలి షాట్‌కు రామ్ పోతినేని స్వయంగా దర్శకత్వం వహించారు.ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ఈ రోజు హైదరాబాద్ శివార్లలో ప్రారంభమైంది. కథానాయకుడు రామ్ పోతినేని చిత్రంలోని ప్రధాన తారాగణంతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటు న్నారు.ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ కథను స్వయంగా రామ్ పోతినేని రాశారు. నియోనోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీనిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని విభిన్న అంశాలను, ఆసక్తికరమైన పాత్రల ప్రయాణంతో ఈ చిత్రం ఉండబో తోంది.దర్శకత్వం, కథతో పాటు ఈ చిత్రంలో రామ్ కథానాయకుడిగానూ నటిస్తున్నారు. కెమెరా ముందు, వెనుక బాధ్యతలు చేపట్టడం ద్వారా ఈ ప్రాజెక్ట్‌పై ఆయనకున్న అంకితభావం స్పష్టమవుతోంది. తన కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రను ఆయన ఇందులో పోషించబోతున్నారు.

## 'నాగబంధం'లో స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను: నభా నటేష్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.

**నాగబంధంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**
ఇప్పటివరకు ఇలాంటి పాత్ర నేను చేయలేదు. ఇందులో నేను పార్వతి పాత్రలో కనిపిస్తాను. తను ఒక వేద విద్యార్థిని. తన పాత్ర ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది.

**ఇందులో చాలా గ్రాండ్‌గా చిత్రీకరించిన డాన్స్ నంబర్ ఉంది కదా... దాని గురించి చెప్పండి?**
ఆ పాట చేయడం నిజంగా అద్భుతమైన అనుభవం. దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో ఆ పాటను గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అందులో క్లాసికల్ డాన్స్ కూడా ఉంటుంది.

**డైరెక్టర్ అభిషేక్ నామా గురించి?**
అభిషేక్ గారికి చాలా క్లియర్ విజన్ ఉంది. ఆయన ఈ కథను చాలా అద్భుతంగా ఊహించుకున్నారు. ఈ సినిమాలో నా పాత్ర కోసం రెడీ అవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. ఈ షూటింగ్‌ను నేను చాలా ఎంజాయ్ చేశాను. అనంత పద్మనాబ స్వామి ఆలయ సెట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు మేమంతా చాలా నియమనిష్ట లతో పని చేశాం. పూర్తిగా శాకాహారులుగా ఉన్నాం.

**ఇందులో మీ పాత్రలో రొమాన్స్ కూడా ఉంటుందా?**
రొమాన్స్ ఉంటుంది. అయితే దానికంటే చాలా ముఖ్యమైన అంశాలు నా పాత్రలో ఉంటాయి. అవే కథకు కీలక మలుపు తీసుకొస్తాయి.

**నిర్మాతల గురించి?**
తొలి సినిమానే అయినప్పటికీ కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో దాదాపు రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రతి విషయంలో రాజీ పడకుండా, కంటెంట్‌కు తగ్గట్టుగా సినిమాను తీర్చిదిద్దారు.ప్రమోషన్స్ కూడా చాలా వినూత్నంగా చేశారు. .

**విరాట్ కర్ణ గురించి?**
విరాట్ కర్ణ చాలా ప్యాషన్, డెడికేషన్ ఉన్న నటుడు. ఇది ఆయన రెండో సినిమా అని అనిపించదు. ఎంతో అనుభవం ఉన్న నటుడిలా నటించారు.

**'నాగబంధం' షూటింగ్ అనుభవం?**
నాగబంధం చాలా భారీ స్థాయి సినిమా. ప్రతిరోజూ షూటింగ్‌లో దాదాపు 200 మంది ఉండేవారు. ప్రతి షెడ్యూల్‌కు సినిమా స్కేల్ మరింత పెరుగుతూ వెళ్లింది.



## 'మకుటం' విజయం సాధించాలి: విశాల్

సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం మకుటం. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ ది రైజ్ అఫ్ లింగా అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఆదివారం (జూన్ 28) నాడు సెకండ్ సింగిల్ నచ్చాకే వచ్చేరా అనే పాటను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో.. విశాల్ మాట్లాడుతూ.. .. 'మకుటం'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోన్నందుకు ఆనందంగా ఉంది. ఈ సారి దర్శకుడిగా మారి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాను. శివ చూసిన తరువాత దర్శకుడిగా మారాలని ఫిక్స్ అయ్యాను. ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరింది. ఈరోజు ఆర్‌బీ చౌదరి గారిని నేను మిస్ అవుతున్నాను. 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ఆయన నాకు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీకి దర్శకుడిగా మారాను. ..అంజలి మాట్లాడుతూ.. .. మదగదరాజా తరువాత విశాల్‌తో కలిసి మకుటం చేశాను. అప్పుడు విశాల్ హీరో.. ఇప్పుడు దర్శకుడు కూడా. ఇందులో నేను ఓ మంచి, పవర్ ఫుల్ రోల్‌ను పోషించాను. విశాల్ నా పాత్రను గొప్పగా తీశాడు. ..జితన్ రమేష్ మాట్లాడుతూ.... విశాల్ మాకు ఎన్నో ఏళ్ల నుంచి తెలుసు. మా ఇంట్లో వ్యక్తిలా, సొంత అన్నలా ఉంటాడు. జీవీ ప్రకాష్ పట్టిందల్లా బంగారం అవుతుంది. మా 'మకుటం' మ్యూజిక్ కూడా పెద్ద హిట్ అవుతుందని అనుకుంటున్నాను. ..నటి ఝాన్సీ మాట్లాడుతూ.. నన్ను తమిళంలో పరిచయం చేస్తున్న విశాల్‌కి థాంక్స్. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. హీరోగా, దర్శకుడిగా అన్ని రకాలుగా విశాల్ ఈ చిత్రంతో అద్భుతం చేశారు.

## 'కళ్యాణం కమనీయం జీవితం" పోస్టర్ విడుదల



వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరోయిన్‌గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్‌రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం కళ్యాణం కమనీయం జీవితం. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ: టైటిల్ చాలా బాగుంది. రాజవంశీ టైటిల్ గురించి చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు .డైరెక్టర్ విజన్ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. హీరో హీరోయిన్ లకు సినిమా టీమ్ కు అల్ ది బెస్ట్ అని అన్నారు నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ : విజయేంద్ర ప్రసాద్ గారు అడగగానే మా పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది ఆయనకు నా కృతజ్ఞతలు. డైరెక్టర్ కథ చెప్పగానే తప్పకుండా ఈ సినిమా చేయాలి అనిపించింది. దర్శకుడు చెప్పిన విధంగా సినిమా తీశాడు సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు మరో నిర్మాత కిషోర్ గుండాల మాట్లాడుతూ పాన్ వరల్డ్ స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ గారు పోస్టర్ ను ఆవిష్కరించి టీమ్ కు బ్లెస్సింగ్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మంచి కథ, కథనాలతో సినిమాని తెరకెక్కించాము త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము అన్నారు

## 'స్టూడెంట్' మూవీ టీజర్ రిలీజ్



స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'స్టూడెంట్' ఈ సినిమాలో విజేత పరీక్ హీరోయిన్ గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్దారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. 'స్టూడెంట్' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవు తోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. "స్టూడెంట్' సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే సరదాగా కాలేజ్ లైఫ్ ఎంజాయ్ చేసే స్టూడెంట్ భాను (మేఘాంశ్ శ్రీహరి) ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ తరుపున పాలిటిక్స్ లోకి రావడం కాలేజ్ లో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. పాలిటిక్‌కు కొత్తైనా రాజకీయాల్లో ఉండే ప్రమాదాలను, ఎత్తులు పై ఎత్తులను త్వరగా అర్థం చేసుకుంటాడు భాను. పక్కనోడు కత్తితో యుద్ధం చేస్తున్నప్పుడు మనం చెయ్యి పెడితే తెగిపోద్ది, మనం పాలిటిక్స్ లో ఉన్నాం, ఇక్కడ ఎథిక్స్ ఉండవు, ఓన్లీ ట్రిక్సే ఉంటాయి. అంటూ మేఘాంశ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ టీజర్ కు హైలైట్ గా నిలుస్తోంది. స్టూడెంట్ రాజకీయాల్లోకి వస్తే ఈ పొలిటికల్ ఆటను ఎలా మార్చేయగలడు అనేది ఇంపాక్ట్ ఫుల్‌గా చూపించారు.

